తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



ఇందిరమ్మ రాజ్యం.. ఎవరికి సాధ్యం??

ఒక ప్రాంతానికి వేల కోట్ల రూపాయల అభివృద్ధి ప్రకటనలు.. మరో ప్రాంతానికి నిధుల కోసం విజ్ఞప్తులు! ఈ వ్యత్యాసం రాజకీయ చర్చకే పరిమితమా.. పాలనా ప్రాధాన్యతలపై ప్రజల్లో మొదలవుతున్న ప్రశ్నకు సంకేతమా? కొడంగల్‌లో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం,...

8వ పేజీ



ప్రపంచం మారబోతోందా? మనిషి భవిష్యత్తు ఏమిటి?

2026–2030.. ఐదేళ్లలో ప్రపంచ ముఖచిత్రం మారుతుందా? యుద్ధాలు, కృత్రిమ మేధస్సు, ప్రకృతి విపత్తులు.. మానవత్వానికి అసలైన పరీక్ష! ప్రపంచ చరిత్రలో కొన్ని సంవత్సరాలు కేవలం కాలగమనంలో భాగంగా మిగిలిపోవు...

9వ పేజీ

ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 287 శనివారం, నవంబర్ 21, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 10 రూ. 2.00

అణు ముప్పు తగ్గింపుపై చర్చలకు అగ్రరాజ్యాల నిర్ణయం



ప్రపంచ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. అగ్రరాజ్యాలైన అమెరికా, చైనా, రష్యా అణ్వాయుధాల ముప్పును తగ్గించే దిశగా కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. చైనాలోని షెన్‌జెన్‌లో గురువారం జరిగిన సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాల్గొన్నారు.

పూర్తిగా 3 లో


టెక్ వైఫల్యాల ఎఫెక్ట్..



అమెరికాలో ఇటీవల చోటుచేసుకున్న తీవ్రమైన సాంకేతిక అంతరాయాల నేపథ్యంలో వైట్‌హౌస్ కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ సైబర్ డైరెక్టర్ సీన్ కెయిన్‌క్రాస్‌ను ఆయన పదవి నుంచి తొలగించింది. దేశంలో వరుసగా సైబర్ భద్రతా వైఫల్యాలు తలెత్తిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పూర్తిగా 4 లో

స్టాండ్ విత్ జెన్సెన్ కు భారీగా మద్దతు



(న్యూయార్క్, సాక్షర): ఎన్విడియా సీఈఓగా జెన్సెన్ హువాంగ్‌ను తిరిగి నియమించాలంటూ సాగుతున్న ప్రచారానికి టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ మద్దతు తెలిపారు. 33 ఏళ్ల క్రితం తాను సహ వ్యవస్థాపకుడిగా మొదలైన సంస్థకు హువాంగ్ రాజీనామా చేసిన 2 రోజుల తర్వాత, ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ మద్దతు తెలిపింది.

పూర్తిగా 4 లో

అమెరికాలో అత్యంత అరుదైన చేప.. 69 నుంచి 137కు పెరిగిన 'డెవిల్స్ హోల్ పప్‌ఫిష్'



అమెరికా : ప్రపంచంలోనే అత్యంత అరుదైన చేప జాతుల్లో ఒకటైన 'డెవిల్స్ హోల్ పప్‌ఫిష్' జనాభాలో అనూహ్యమైన పెరుగుదల నమోదైంది. అంతరించిపోయే దశకు చేరుకుందనుకున్న ఈ జీవి మళ్లీ పునరుజ్జీవం పోసుకోవడం పట్ల పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిగా 4 లో

జనాభాతో పాటు జీడీపీ ప్రాతిపదిక కావాలి



(హైదరాబాద్, సాక్షర): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో జనాభా ఒక్కటే ప్రాతిపదిక కాకూడదని, రాష్ట్రాల ఆర్థిక ప్రగతికి కూడా సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేవలం జనాభా ఆధారంగా 50 శాతం సీట్ల పెంపు చేపడితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, ఉత్తరాది రాష్ట్రాల సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాల జీడీపీ, జనాభా రెండింటినీ పరిగణనలోకి తీసుకుని పునర్విభజన చేపట్టాలని సూచించారు. ఏబీపీ నెట్‌వర్క్ హైదరాబాద్‌లో నిర్వహించిన 'ది సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026' మీడియా కాంక్లేవ్‌లో వివిధ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. దేశాభివృద్ధిలో గతంలో కాంగ్రెస్ పార్టీ అనుసరించిన నమూనా, గత నేతల దార్శనికతను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ప్రతి పేదవాడి అభ్యున్నతే నిజమైన అభివృద్ధి అని మహాత్మా గాంధీ , జవహర్‌లాల్ నెహ్రూ విశ్వసించారని గుర్తుచేశారు. నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు ప్రాధాన్యతనిస్తూ అనేక విద్యాసంస్థలు, నీటిపారుదల ప్రాజెక్టులను ఏర్పాటు చేశారని తెలిపారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, సరళీకృత ఆర్థిక విధానాలను మన్మోహన్ సింగ్ గారు కొనసాగించిన తీరును ప్రస్తావిస్తూ, పేదల సంక్షేమం, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి నమూనా అని పేర్కొన్నారు. తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలనే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను రూపొందించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ వంటి ప్రాజెక్టుల ద్వారా తెలంగాణకు ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్న తన దార్శనికతను వెల్లడించారు. గడిచిన మూడేళ్లలో 65 శాతం కార్యక్రమాలను అమలు చేశామని, మిగిలిన వాటిని వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు కల్పిస్తూ అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఆహ్వానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటైన విద్యను అందించడమే లక్ష్యంగా విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లోనే ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని గుర్తుచేశారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెరిగిందని వివరించారు.

మిగతా 4 లో

బీఆర్ఎస్ మాకు ప్రధాన శత్రువు.. బీజేపీ పోటీ కాదు: సీఎం రేవంత్ రెడ్డి





(హైదరాబాద్, సాక్షర): 'బీఆర్ఎస్ మాకు ప్రధాన శత్రువు.. బీజేపీ మాకు పోటీ కాదు' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హిందువులను ఒకటి చేయడానికి మోదీ, అమిత్ షా ప్రయత్నం చేస్తున్నారని.. ముస్లింలను ఒకటి చేయడానికి అసదుద్దీన్ ఒవైసీ ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు వెళ్తోందని వెల్లడించారు. దేశ జనాభాలో 15 శాతం ఉన్న వాళ్లను కూడా కలుపుకుని వెళ్లాల్సిందే అని చెప్పుకొచ్చారు. బీజేపీ మైనారిటీ రిజర్వేషన్లను ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు.

3 లో



జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఘనంగా

పేజీ 2



జల దోపిడీని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

పేజీ 3

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో ఆర్థిక భరోసా

పేజీ 3

ముందు కేబినెట్ ఖాళీలను భర్తీ చేయండి



- రేవంత్ రెడ్డిపై వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు
- సిరిసిల్ల, సిద్దిపేటల్లో గెలిస్తే మంత్రి పదవులు ఇస్తామన్న రేవంత్ హామీలపై వేముల విమర్శలు
- రాష్ట్ర మంత్రివర్గంలో ఇప్పటికే 3 పదవులు ఖాళీగా ఉన్నాయన్న వేముల
- సొంత కేబినెట్‌ను విస్తరించే ధైర్యం ముఖ్యమంత్రికి లేదని ఆరోపణ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారశైలిపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

4 లో

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకురాలు రేఖా నాయక్ ఇళ్లలో ఈడీ సోదాలు



(హైదరాబాద్, సాక్షర): ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకురాలు రేఖా నాయక్ ఇళ్లలో ఈడీ సోదాలు కలకలం రేపాయి. శుక్రవారం నాడు ఏకకాలం రెండు చోట్ల ఏకకాలంలో ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రూ.40.96 కోట్ల సీఎంఆర్ ధాన్యం అక్రమాల కేసులో సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. సత్తెనపల్లిలో రేఖా నాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో భారీగా ధాన్యం మాయం అయింది. 2022-23, 2023-24, 2024-25 యాసంగి సీజన్లలో ప్రభుత్వం మిల్లింగ్ నిమిత్తం కేటాయించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి తిరిగి అప్పగించకుండా పక్కదారి పట్టించినట్లు అధికారులు గుర్తించారు. గతంలో పౌరసరఫరాల శాఖ నిర్వహించిన తనిఖీల్లో ఈ రైస్ మిల్లులో ఏకంగా 9,639.

3 లో

రేవంత్ కు రాజగోపాలరెడ్డి కౌంటర్



హైదరాబాద్, సాక్షర: సిద్ధిపేట సభలో కాంగ్రెస్ పార్టీలోని అసమ్మతి నేతలను ఉద్దేశించి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. ఉన్నత పదవుల్లో ఉన్న నేతలు హుందాగా మాట్లాడాలని రాజగోపాల్ రెడ్డి హితవు పలికారు. అధికారం ఉందన్న అహంకారంతో ఇష్టం వచ్చినట్లు వ్యవరిహరిస్తే జనం హర్షించరని గ్రహించాలన్నారు. అదృష్టం కొద్దీ లభించిన అధికారంతో అవినీతికి పాల్పడే, ప్రజల అవసరాలను విస్మరించి.. దుర్మార్గపు పాలన సాగించే పాలకులను తెలంగాణ ప్రజానీకం, చరిత్ర ఎన్నటికీ క్షమిందనే విషయాన్ని మరవొద్దని హెచ్చరించారు.

3 లో

నా ఎత్తు, కేటీఆర్ గడ్డం గురించేనా నీ పంచాయితీ?..



మెదక్, సాక్షర: సిద్దిపేటలో నిర్వహించిన ఇందిరమ్మ జీవిత బీమా సభ అట్టర్ ప్లాప్ కావడంతో సీఎం తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. అసలు సభకు వచ్చిన పథకం గురించి మాట్లాడకుండా తన ఎత్తు, కేటీఆర్ గడ్డం వంటి వ్యక్తిగత విషయాలపై విమర్శలు చేయడానికే రేవంత్ వచ్చారా? అని ప్రశ్నించారు. సొంత జిల్లాలో జనం రాకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి జనాన్ని తరలించిన విషయాన్ని అక్కడి పోలీస్ కమిషనరే స్వయంగా చెప్పారని తెలిపారు.తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని.. 2029 ఎన్నికల్లో తెలంగాణతోపాటు అక్కడ కూడా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి నిన్న సిద్దిపేట సభ సాక్షిగా చేసిన వ్యాఖ్యలకు హరీశ్‌రావు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేయాలని.. అక్కడే ఎవరి సత్తా ఏంటో తేల్చుకుందామని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. సిద్దిపేట సభలో రేవంత్ ప్రసంగం మొత్తం అబద్ధాలు, విమర్శలతోనే సాగిందని మండిపడ్డారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు ఈ వ్యాఖ్యలు చేశారు.

పూర్తిగా 3 లో

సంపాదకీయం

నగదు బదిలీ పథకాలకు 4 లక్షల కోట్లా

నగదు బదిలీ పథకాలపై 2026-27లో రాష్ట్రాలు రూ.4 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఇది స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 1 శాతంతో సమానం. 2022-23లో ఇది 0.6 శాతంగా ఉంది. అదే సమయంలో రాయితీలపై కూడా రాష్ట్రాలు అధికంగా ఖర్చు చేస్తున్నాయి. ఈశాన్య రాష్ట్రాలు మినహా మిగిలిన రాష్ట్రాల్లో రాయితీలు పెరిగాయి. 2018-19లో రాష్ట్రాల రెవెన్యూ వసూళ్లలో 16% రాయితీలపై ఖర్చు చేసేవారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి ఇది 21 శాతానికి చేరింది' అని 'పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్' వెల్లడించింది. 2026-27కు సంబంధించి రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులపై ఆ సంస్థ వెల్లడించిన నివేదికలో ఈ విషయాలు ఉన్నాయి. అందులోని ముఖ్యాంశాలు ఇవి.. 2022-23లో ఆంధ్రప్రదేశ్ తన మొత్తం రెవెన్యూలో 20% నగదు బదిలీ పథకాలకే వెచ్చించింది. ఈ విషయంలో ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ కూడా ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ముందున్నాయి. సబ్సిడీలు, నగదు బదిలీ పథకాలపై ఎక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లు ముందున్నాయి. నగదు బదిలీ పథకాలను మహిళలు, రైతులు, యువత, దివ్యాంగులకు అమలు చేస్తున్నారు. సామాజిక భద్రత పెన్షన్ల రూపంలోనూ చెల్లిస్తున్నారు. పీఎం కిసాన్ నిధులతో పాటు రైతులకు అదనంగా నిధులు చెల్లిస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. నగదు బదిలీ పథకాలకు ఈ నివేదికలో చెప్పిన మొత్తం కన్నా ఇంకా ఎక్కువే ఖర్చు చేస్తున్నారని ఆ నివేదిక పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ సహా మరికొన్ని రాష్ట్రాలు నగదు బదిలీ పథకాలపై 2026-27లో రెవెన్యూ రాబడిలో 10 శాతానికి మించి ఖర్చు చేయనున్నాయి. దేశంలో 14 రాష్ట్రాలు నగదు బదిలీ పథకంపై ఖర్చు చేస్తున్న మొత్తంలో నాలుగింట మూడొంతులు సామాజిక భద్రత పెన్షన్లకే వెచ్చిస్తున్నాయిఈ ఆర్థిక ఏడాదిలో నగదు బదిలీ పథకాల కోసం రెవెన్యూ వ్యయంలో అత్యధిక వాటా కేటాయించిన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో నిలిచాయి. తెలంగాణ రెండో స్థానంలో, ఏపీ నాలుగో స్థానంలో ఉంది. రైతులు, పింఛనుదారుల కోసం కలిపి తెలంగాణ ప్రభుత్వం రూ.32,629 కోట్లు కేటాయించగా.. ఏపీ రూ.33,943 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించింది. దేశవ్యాప్తంగా రాష్ట్రాలు ఈ తరహా పథకాల కోసం సుమారు రూ.4 లక్షల కోట్లు కేటాయించాయి. అయితే నగదు బదిలీలపై పెరుగుతున్న వ్యయం ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితిపై భారంగా మారుతోందని 16వ ఆర్థిక సంఘం ఆందోళన వ్యక్తం చేసింది.సంక్షేమ పథకాల కింద ప్రజలకు నేరుగా నగదు బదిలీ చేసే విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు దేశంలోనే టాప్‌లో ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రాలు తమ రెవెన్యూ వ్యయంలో నగదు బదిలీ పథకాల కోసం కేటాయించిన నిధుల వాటా ఆధారంగా రూపొందించిన నివేదికలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 15 శాతం కేటాయింపులతో జార్ఖండ్ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉండగా.. 14 శాతంతో తెలంగాణ, పశ్చిమ బెంగాల్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక 13 శాతం కేటాయింపులతో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో నిలిచింది.2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన 128 నగదు బదిలీ పథకాల కోసం రూ.32,629 కోట్లు కేటాయించింది. ఈ మొత్తం రాష్ట్ర రెవెన్యూ రాబడుల్లో 14 శాతానికి సమానం. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇదే తరహా పథకాల కోసం రూ.33,943 కోట్లు కేటాయించింది. ఇది ఆ రాష్ట్ర రెవెన్యూ రాబడుల్లో 13 శాతంగా ఉంది. తెలంగాణ కేటాయింపుల్లో రైతుల కోసం రూ.18 వేల కోట్లు.. సామాజిక భద్రతా పింఛన్ల కోసం రూ.14,629 కోట్లు ఉన్నాయి. ఏపీలో సామాజిక భద్రతా పింఛన్లకు రూ.27,343 కోట్లు.. రైతులకు ఆర్థిక సాయం అందించే పథకాల కోసం రూ.6,600 కోట్లు కేటాయించారు.నగదు బదిలీ పథకాల కోసం అత్యధికంగా పశ్చిమ బెంగాల్ రూ.47,542 కోట్లు కేటాయించింది. ఆ తర్వాత కర్ణాటక రూ.40,392 కోట్లు, మహారాష్ట్ర రూ.38,549 కోట్లతో ఉన్నాయి. మధ్యప్రదేశ్ రూ.32,059 కోట్లు, తమిళనాడు రూ.19,036 కోట్లు కేటాయించాయి. రెవెన్యూ వ్యయంలో నగదు బదిలీ పథకాలకు కేటాయించిన వాటా రాష్ట్రాలవారీగా చూస్తే.. జార్ఖండ్ 15 శాతం, తెలంగాణ 14 శాతం, పశ్చిమ బెంగాల్ 14 శాతం, ఆంధ్రప్రదేశ్ 13 శాతం, కర్ణాటక 12 శాతం, మధ్యప్రదేశ్ 10 శాతం, మహారాష్ట్ర 6 శాతంగా ఉన్నాయి.ఈ నగదు బదిలీ పథకాల పరిధిలో మహిళలు, రైతులు, యువతతోపాటు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందించే సామాజిక భద్రతా పింఛన్లు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఈ తరహా పథకాల కోసం రాష్ట్రాలు కలిపి సుమారు రూ.4 లక్షల కోట్లు కేటాయించడం గమనార్హం. ఇది దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దాదాపు ఒక శాతానికి సమానం. 2022-23లో ఈ పథకాల కేటాయింపులు జీడీపీలో 0.6 శాతంగా ఉండగా.. 2026-27 నాటికి ఒక శాతానికి చేరడం గమనార్హం.మొత్తం కేటాయింపుల్లో దాదాపు 90 శాతం మహిళలకు అందించే ఆర్థిక సాయం, సామాజిక భద్రతా పింఛన్లకే వెళ్తున్నాయి. మహిళలకు ఇచ్చే సాయంలో ఎక్కువ భాగం నెలవారీగా చెల్లించేలా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నారు. రైతులకు ఇచ్చే సాయం, ఇతర పథకాల మొత్తాలను మాత్రం ఏడాదిలో రెండు లేదా మూడు విడతలుగా అందించే విధానాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు, నగదు బదిలీలపై చేస్తున్న ఖర్చు క్రమంగా పెరుగుతోందని ఈ రిపోర్ట్ వెల్లడించింది. ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువ భాగాన్ని మినహాయించి చూస్తే.. 2018-19లో రాష్ట్రాల రెవెన్యూ రాబడుల్లో సబ్సిడీలు, నగదు బదిలీల వాటా 16 శాతంగా ఉండేది. 2023-24 నాటికి అది 21 శాతానికి పెరిగింది.ఈ కాలంలో నగదు బదిలీల వ్యయం ఏటా సగటున 24 శాతం వృద్ధి చెందింది. ఇదే సమయంలో సబ్సిడీల ఖర్చు వృద్ధి 12 శాతంగా నమోదైంది. అంటే సబ్సిడీలతో పోలిస్తే నగదు బదిలీలపై ప్రభుత్వాల వ్యయం రెండింతల వేగంతో పెరిగిందని నివేదిక విశ్లేషించింది. నగదు బదిలీ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా ఆర్థిక సాయం అందుతున్నప్పటికీ.. వాటి అమలులో కొన్ని సమస్యలు ఉన్నాయని 16వ ఆర్థిక సంఘం అభిప్రాయపడింది. ఈ పథకాల్లో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉండటం, అర్హత ప్రమాణాలు విస్తృతంగా ఉండటంతో లక్ష్యిత వర్గాలకు మాత్రమే ప్రయోజనం చేరేలా చేయడం కష్టమవుతోందని పేర్కొంది.దీంతో ప్రభుత్వాలపై గణనీయమైన ఆర్థిక భారం పడుతోందని.. అనర్హులకూ ప్రయోజనాలు అందే అవకాశం ఉందని 16వ ఆర్థిక సంఘం అభిప్రాయం వ్యక్తం చేసింది. అందువల్ల లబ్ధిదారుల జాబితాలను హేతుబద్ధీకరించి.. నిజంగా అర్హులైన వారికే పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. ఈ నివేదికలో 128 నగదు బదిలీ పథకాలను మాత్రమే గుర్తించి విశ్లేషించారు. దేశవ్యాప్తంగా అమలు అవుతున్న పథకాలన్నింటినీ ఇది పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదని కూడా స్పష్టం చేసింది. అందువల్ల వాస్తవంగా రాష్ట్రాలు నగదు బదిలీ పథకాలపై చేస్తున్న ఖర్చు నివేదికలో పేర్కొన్న మొత్తాల కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

బిల్డర్ తప్పుకు కొనుగోలుదారుడెందుకు బలి?

- అసంపూర్తి ప్రాజెక్టుల్లోని ఫ్లాట్ల కొనుగోలుదారులకు సుప్రీంకోర్టులో ఊరట
- బిల్డర్-బ్యాంకు అధికారుల బంధం తేల్చకుండా రుణ రికవరీకి ఆదేశించొద్దు
- నిర్మాణానికి అనుగుణంగానే రుణాలు ఇచ్చారో లేదో కోర్టులు పరిశీలించాలి
- కొనుగోలుదారుల తప్పుంటే తప్ప ఈఎంఐలు చెల్లించాలని ఒత్తిడి చేయకూడదు

దేశవ్యాప్తంగా అసంపూర్తి గృహ నిర్మాణ ప్రాజెక్టుల కారణంగా ఆర్థికంగా నష్టపోతున్న ఫ్లాట్ల కొనుగోలుదారులకు సుప్రీంకోర్టు భారీ ఊరటనిచ్చింది. బిల్డర్లు, బ్యాంకు అధికారుల మధ్య కుమ్మక్కు ఉందో లేదో తేల్చకుండా, రుణ వాయిదాల (ఈఎంఐ) చెల్లింపు కోసం కొనుగోలుదారులను ఒత్తిడి చేయరాదని స్పష్టం చేసింది. ఈ మేరకు కమర్షియల్ కోర్టులు, నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)లకు సర్వోన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. దివాలా ప్రక్రియను ఎదుర్కొంటున్న రహేజా డెవలపర్స్‌కు చెందిన కృష్ణా హౌసింగ్ ప్రాజెక్టులో ఫ్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. ఫ్లాట్లు చేతికి అందకపోయినా, రుణ రికవరీ కోసం ఢిల్లీలోని సాకేత్ కమర్షియల్ కోర్టులో బ్యాంకులు చర్యలు ప్రారంభించడంతో బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా, నిర్మాణ పనుల పురోగతికి అనుగుణంగానే బిల్డర్‌కు బ్యాంకులు రుణాలు విడుదల చేశాయా? లేదా? అన్నది ధ్రువీకరించుకోవడం కోర్టుల ప్రాథమిక బాధ్యత అని ధర్మాసనం స్పష్టం చేసింది. కొనుగోలుదారుల వైపు పొరపాటు ఉన్నట్లు నిర్దిష్టంగా తేలితే తప్ప, వారిపై ఈఎంఐల చెల్లింపు కోసం ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయరాదని బెంచ్ పేర్కొంది. త్రైపాక్షిక ఒప్పందాల ప్రకారం, నిర్మాణ దశలను బట్టి బిల్డర్‌కు నేరుగా నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ చాలా సందర్భాల్లో, నిర్మాణం జరగక ముందే బ్యాంకులు నిధులు విడుదల చేస్తుండటంతో ప్రాజెక్టులు ఏళ్ల తరబడి అసంపూర్తిగా మిగిలిపోతున్నాయి. దీనివల్ల కొనుగోలుదారులు అటు ఇంటి అద్దె, ఇటు ఈఎంఐలు చెల్లిస్తూ తీవ్రంగా నష్టపోతున్నారని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ కేసుతో పాటు, బెంగళూరులో దాదాపు 4,500 మంది హోమ్ బయ్యర్లకు సంబంధించిన మరో కేసులోనూ సుప్రీంకోర్టు ఇటువంటి ఆదేశాలే ఇచ్చింది. అక్కడ కొనుగోలుదారులు 95 శాతం మేర సొమ్ము చెల్లించినా, పదేళ్లుగా ప్రాజెక్టు పూర్తికాకపోవడంతో వారికి రికవరీ చర్యల నుంచి రక్షణ కల్పించింది. ఇటువంటి వివాదాలపై గతేడాది సెప్టెంబరులో జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం దేశవ్యాప్తంగా బిల్డర్లు, బ్యాంకుల తీరుపై సీబీఐ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.

బీమా దరఖాస్తులో వివరాల నమోదు పక్కాగా ఉండాలి



- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వివరాలు అందరికీ చేరవేయాలి
- జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో ప్రత్యేక శిబిరాల ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

(వేములవాడ, సాక్షర): అర్బన్ మండలం ఆర్ అండ్ ఆర్ కాలనీ చీర్లవంచ, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో ప్రత్యేక శిబిరాల్లో జిల్లా కలెక్టర్ పరిశీలన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో భాగంగా బీమా దరఖాస్తులో వివరాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లావ్యాప్తంగా సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి... కుటుంబాల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా వేములవాడ అర్బన్ మండలం ఆర్ అండ్ ఆర్ కాలనీ చీర్లవంచ, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 23 వ వార్డు లో ఏర్పాటు చేసిన కేంద్రాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయగా, పరిశీలించారు. రిజిస్టర్లు ఏర్పాటు చేసి దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేయగా, పరిశీలించి.. ఎందరు నమోదు చేసుకున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆన్లైన్లో బీమా వివరాలు నమోదు చేస్తుండగా, పరిశీలించి.. మొత్తం ప్రక్రియ పూర్తి అయ్యేందుకు ఎంత సమయం పడుతుందో ఆరా తీశారు. సిరిసిల్లలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పై అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు డిసెంబర్ 19వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. అన్ని కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ లు ఉన్నాయని వివరించారు. బీమా వివరాల నమోదు సమాచారం చేరవేయాలని ఆదేశించారు. అర్హీదారులు రేషన్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు ఇవ్వాలని సూచించారు. అన్ని ప్రత్యేక కేంద్రాల్లో బీమా వివరాలు, నామినీ వివరాలు పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, నోడల్ అధికారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సిరిసిల్ల 23వ వార్డు సభ్యురాలు ఆడెపు చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్లు జయంత్, మహేష్ తదితరులు ఉన్నారు

సీఎం హుందాతనాన్ని కాపాడుకోవాలి: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



గజ్వేల్,సాక్షర: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట పర్యటనలో ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడకుండా కేసీఆర్, హరీశ్ రావు, వారి కుటుంబంపై వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యం ఇవ్వడం దురదృష్టకరమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. సీఎం పర్యటనతో తమ ప్రాంతానికి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు వస్తాయని, పెండింగ్ ప్రాజెక్టు కాలువలకు మోక్షం కలుగుతుందని, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా, రైతుబంధు అందుతాయని, రోడ్లు బాగుపడతాయని ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని అన్నారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం తిట్ల పురాణంతో సరిపెట్టారని మండిపడ్డారు. గజ్వేల్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటేరు ప్రతాప్ రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లాల పర్యటనకు వచ్చినప్పుడు ముందుగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో మాట్లాడి ప్రాంతంలోని సమస్యలను తెలుసుకునేవారని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీరు, రోడ్లు, అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించి, అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేసేవారని తెలిపారు. కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాల స్క్రిప్ట్‌తో వస్తే.. రేవంత్ రెడ్డి విమర్శలు, వ్యక్తిగత దూషణల స్క్రిప్ట్‌తో వస్తున్నారని ఎద్దేవా చేశారు. కానీ సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడే మాటలకు ఒక హుందాతనం ఉండాలని, దిగజారుడు వ్యాఖ్యలు చేయడం వల్ల ముఖ్యమంత్రి పదవికే గౌరవం తగ్గుతుందని అన్నారు. ఎక్కడికి వెళ్లినా కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించడం మానుకోవాలని, ప్రజలు ఇలాంటి వ్యాఖ్యలను హర్షించడం లేదని పేర్కొన్నారు. తన సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రభుత్వ పనితీరుపై వ్యాఖ్యలు చేస్తున్నారని, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నిధులు విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేల సమస్యలు పరిష్కరించలేని ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుల వెంట పడటం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంపై చేసిన వ్యాఖ్యల ను తీవ్రంగా ఖండిస్తున్నామని, రేవంత్ రెడ్డి తన మాటతీరును మార్చుకోవాలని సూచించారు.

నీటి హక్కులపై రాజీ లేదు..



హైదరాబాద్, సాక్షర: తెలంగాణకు దక్కాల్సిన నీటి హక్కుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని, కృష్ణా, గోదావరి నదుల నుంచి ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నీటి హక్కుల పరిరక్షణ కోసం ఎంతవరకైనా పోరాడతామని, ఏ త్యాగానికైనా సిద్ధమని తేల్చి చెప్పారు. హుజూర్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభలో, హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నాగార్జున సాగర్ నుంచి 1.8 టీఎంసీల నీటిని తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏకపక్ష ప్రతిపాదనపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు (కేఆర్ఎంబీ) అధికారికంగా అభ్యంతరాలు తెలిపామని వెల్లడించారు. భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా దేశ సరిహద్దుల్లో ఎంత పట్టుదలతో పనిచేశానో, రాష్ట్ర నీటి హక్కుల పరిరక్షణలోనూ అదే తెగువ చూపిస్తానని ఆయన అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణా బేసిన్ రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. పదేళ్ల పాలనలో ఏపీ ప్రభుత్వం కృష్ణా నుంచి 4,460 టీఎంసీలు తరలించుకుపోతుంటే బీఆర్ఎస్ నేతలు చూస్తూ ఊరుకున్నారని, ఆ సమయంలో తెలంగాణ కేవలం 1993 టీఎంసీలు మాత్రమే వాడుకుందని తెలిపారు. తాము ఏపీ నేతలతో లాలూచీ పడేవాళ్లం కాదని, అందుకే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నీటి వాడకం పెరిగిందని గణాంకాలతో వివరించారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ఈ విషయాన్ని కేసీఆరే స్వయంగా అసెంబ్లీలో చెప్పారని గుర్తుచేశారు. ఆమె వల్లే తమ కుటుంబానికి పదవులు వచ్చాయన్న విషయాన్ని కేటీఆర్ మర్చిపోయి మాట్లాడుతున్నారని ఉత్తమ్ విమర్శించారు. రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూస్తామని, అర్హులందరికీ చేయూత పెన్షన్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

లతీఫ్ భట్ ఎన్‌కౌంటర్ వేళ.. మౌంటెన్ ర్యాట్స్..?



జమ్మూకశ్మీర్ : జమ్మూకశ్మీర్‌లో కరుడుగట్టిన ఉగ్రవాది లతీఫ్ భట్ ఎన్‌కౌంటర్ వేళ ఓ కమాండో వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. గుబురు గడ్డంతో.. ఖాకీ వస్త్రం తొడుగు ఉన్న ఏకే-203 రైఫిల్, మిలిటరీ గేర్‌తో రగ్గ్డ్ లుక్‌తో ఉన్న ఈ కమాండో వీడియో సోషల్ మీడియాలో కనిపిస్తోంది. ఆపరేషన్లలో పాల్గొన్న సిబ్బంది పేర్ల విషయంలో భద్రతా దళాలు గోప్యత పాటిస్తాయి. అయితే, అతడి డ్రెస్‌పై ఉన్న బ్యాడ్జ్ ఆధారంగా సైన్యంలోనే అత్యంత శక్తిమంతమైన '9 పారా స్పెషల్ ఫోర్స్' కమాండోగా భావిస్తున్నారు. ఈ బెటాలియన్‌కు 'మౌంటెన్ ర్యాట్స్', 'పైరేట్స్', 'ఘోస్ట్ ఆపరేటర్స్' అనే నిక్‌నేమ్స్ ఉన్నాయి. సైన్యంలో ఈ ఫోర్స్ అత్యంత ప్రత్యేకం. దీని కమాండోలు జమ్మూకశ్మీర్‌లోని రాష్ట్రీయ రైఫిల్స్‌తోపాటు ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో చురుగ్గా పాల్గొంటారు. యుద్ధంలోనే దీని పుట్టుక..: 1965లో భారత్-పాక్ యుద్ధం వేళ శత్రు భూభాగాల్లోకి చొచ్చుకెళ్లి మెరుపు దాడులు చేయడానికి సైన్యంలో కర్నల్ మేఘ్ సింగ్ ఓ ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దీని శిక్షణ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. దీనిని మేఘ్‌దూత్ ఫోర్స్‌గా వ్యవహరించేవారు. 1965 యుద్ధంలో 'హాజీ పీర్ బల్జ్' వద్ద ఈ దళం పాక్ స్థావరాలపై మెరుపు దాడులు చేసి.. దాని స్వాధీనానికి మార్గం సుగమం చేసింది. దీని పనితీరు చూసి.. ఈ దళంతో 1966 జులై 1వ తేదీన 9వ పారాచూట్ కమాండో బెటాలియన్ ఏర్పాటు చేశారు. సైన్యంలో ఏర్పాటు చేసిన తొలి స్పెషల్ ఫోర్స్ ఇదే అని చెబుతారు. ''మినిమం మెన్.. మ్యాక్సిమమ్ ఇంపాక్ట్'' అనేది దీని నినాదం. ఉధంపూర్ కేంద్రంగా పనిచేసే వీరు పర్వత యుద్ధ తంత్రంలో దిట్టలు. దీంతోనే వీరికి 'మౌంటెన్ ర్యాట్స్' అనే పేరు వచ్చింది. చిన్న దళాలుగా వెళ్లి శత్రువులకు భారీ నష్టం చేయడం వీరి శైలి. డిఫెండర్ ఆఫ్ పూంచ్..: 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధం వేళ 'ఆపరేషన్ మంధోల్' చేపట్టి.. పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఫిరంగులను ధ్వంసం చేశారు. దీంతో వీరికి 'డిఫెండర్ ఆఫ్ పూంచ్' అనే గౌరవం దక్కింది. శ్రీలంకలో శాంతి పరిరక్షక దళంలో కూడా 9 పారా ఎస్ఎఫ్ కమాండోలు ఉన్నారు. కార్గిల్ యుద్ధంతోపాటు, 2001లో ఆపరేషన్ అపాచీ, 2016 సర్జికల్ స్ట్రైక్స్‌లో ఈ దళం ప్రధాన పాత్ర పోషించింది.

జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్



(కరీంనగర్, సాక్షర): లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో గురువారం వావిలాలపల్లిలోని గౌరిశెట్టి వెంకటయ్య మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు జాతీయ ఐక్యత, మత సామరస్యం, సోదరభావం ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే సందేశంతో బి.ఎడ్. విద్యార్థులకు పునర్వినియోగ వస్త్ర సంచులను పంపిణీ చేశారు. విద్యార్థులకు బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమానికి సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మ్యాడం శివకాంత్, బట్టు వినోద్, మెతుకు కె. చైతన్య, సింగమ రాజు, ఐత సూరజ్, కోల అన్నారెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ ఐక్యతతో పాటు పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి నా ఎత్తు, కేటీఆర్ గడ్డం గురించేనా నీ పంచాయితీ?..

సిద్దిపేటలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి.. ఆ పథకం గురించి మాట్లాడకుండా తనతో పాటు కేసీఆర్, కేటీఆర్ పేర్లను పదేపదే ప్రస్తావించారని విమర్శించారు. సిద్దిపేట సభలో రేవంత్‌రెడ్డి ముఖంలో తీవ్ర నిరాశ, అసహనం కనిపించాయని అన్నారు. తమ పేర్లను సీఎం ఏకంగా 140 సార్లు తలచుకున్నారని వ్యాఖ్యానించారు. తనను తాటిచెట్టుతో పోల్చుకుంటూ, రేవంత్‌రెడ్డిని గన్నేరు చెట్టుతో పోల్చారు. కుట్రలు చేయడం తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ముఖ్యమంత్రికి లేదని విమర్శించారు. ఆయన ప్రసంగంలో అబద్ధాలు, బూతులు తప్ప ప్రజలకు ఉపయోగపడే ఒక్క మాట కూడా లేదని మండిపడ్డారు. సిద్దిపేట సభకు ఇతర జిల్లాల నుంచి ప్రజలను తరలించారని.. ఈ విషయాన్ని సిద్దిపేట కమిషనరే తనతో చెప్పారని హరీశ్‌రావు పేర్కొన్నారు. అంతకుముందు సిద్దిపేటలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై తీవ్ర విమర్శలు చేశారు. 2029 ఎన్నికల్లో తెలంగాణలోనే కాకుండా సిద్దిపేట గడ్డపైనా కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేటలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఆ నియోజకవర్గానికి మంత్రి పదవి ఇస్తానని ప్రకటించారు. ప్రజలు కోరుకున్న నాయకుడికే కాంగ్రెస్ టికెట్ ఇస్తామని.. ఆ అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత ప్రజలదేనని అన్నారుతెలంగాణ సాగునీటి హక్కులను సీఎం రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. చంద్రబాబు జలదోపిడీకి సీఎం రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీల వాటాకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని.. రాష్ట్రం ఏర్పడిన 40 రోజుల్లోనే కృష్ణా జలాల పునఃపంపిణీ చేయాలని కేసీఆర్ డిమాండ్ చేశారని గుర్తుచేశారు. కృష్ణా ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర ప్రభుత్వం సరైన వాదనలు వినిపించడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితుల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే సభలో బూతులు, అబద్ధాలు వల్లెవేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నీటిని ఎత్తిపోసేందుకు పంపులు, మోటార్లు లేవంటూ సీఎం చెప్పడం పచ్చి మోసమని హరీశ్ ఆరోపించారు. అలాంటప్పుడు దేవాదుల దగ్గర మోటార్లను పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదని, శ్రీశైలం నుంచి కేటాయించిన నీటిని ఎందుకు తోడలేకపోతున్నారని నిలదీశారు. కృష్ణా నదిలో రాష్ట్రానికి రావాల్సిన 299 టీఎంసీలను సైతం ఉపయోగించుకోలేని అసమర్థ స్థితిలో ఈ పాలన ఉందని విమర్శించారు. ట్రిబ్యునల్ ముందు సమర్థంగా వాదనలు వినిపించడంలో సర్కారు ఘోరంగా విఫలమైందన్నారు. అబద్ధాలు చెప్పడంలో రేవంత్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని, సభలో మాట్లాడిన పచ్చి అబద్ధాలకు గానూ సీఎం ముక్కు నేలకు రాయాలని హరీశ్ డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించే పనిలో పడి తెలంగాణ సాగునీటి హక్కులను తాకట్టు పెడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. కృష్ణా జలాల దోపిడీకి కాంగ్రెస్ సర్కారే ప్రత్యక్షంగా సహకరిస్తోందని మండిపడ్డారు.

2029 ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రక్షాళన..



రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ సంస్థాగత నిర్మాణంలో భారీ ప్రక్షాళన చేపట్టింది. వివిధ రాష్ట్రాలు, కీలక విభాగాల పర్యవేక్షణ కోసం మొత్తం 81 మంది నూతన జాతీయ కార్యదర్శులను నియమిస్తూ ఏఐసీసీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ క్రమంలోనే గతంలో బాధ్యతలు నిర్వర్తించిన 25 మంది నాయకులను పదవుల నుంచి తప్పించి, సరికొత్తగా 43 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించింది. ఈ నియామకాల్లో రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా 'సామాజిక న్యాయం' సూత్రానికి పెద్దపీట వేశారు. మొత్తం 81 మంది కార్యదర్శుల్లో దాదాపు మూడింట రెండు వంతుల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ మరియు మైనార్టీ వర్గాలకు చెందినవారే ఉన్నారు. ఇందులో జనరల్ కేటగిరీ నుంచి 29 మంది, ఓబీసీ నుంచి 20, ఈబీసీ నుంచి 5, ఎస్సీల నుంచి 11, ఎస్టీల నుంచి 5, మైనార్టీల నుంచి 11 మందికి చోటు దక్కింది. మహిళా ప్రాతినిధ్యం కింద 12 మందికి (సుమారు 15 శాతం) బాధ్యతలు అప్పగించారు. ఈ నేతల సగటు వయస్సు 49 ఏళ్లు కాగా, మెజారిటీ నాయకులు 50 ఏళ్ల లోపు వారే కావడం విశేషం. ఈ ఎంపిక కోసం రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీలు దాదాపు 200 మంది నేతలను స్వయంగా ఇంటర్వ్యూ చేసి జాబితాను సిద్ధం చేశారు. మీడియా, కమ్యూనికేషన్స్ విభాగ కార్యదర్శులుగా డాక్టర్ వినీత్ పునియా, రుచిరా చతుర్వేదిలను కొనసాగించగా, కాంగ్రెస్ అధ్యక్షుడి కార్యాలయ కార్యదర్శులుగా ప్రణవ్ ఝా, గౌరవ్ పాంధీలు తమ బాధ్యతల్లో కొనసాగనున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే బాధ్యతను ఈ నూతన కార్యదర్శుల బృందానికి కాంగ్రెస్ నాయకత్వం అప్పగించింది.

జల దోపిడీని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



నల్లగొండ, సాక్షర : పల్నాడు వాటర్ గ్రిడ్ పేరుతో నాగార్జునసాగర్ విజయపురి వద్ద, పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న జలాల తరలింపు వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. ఈ అంశంపై ఆయన నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. తాగునీటి అవసరాల పేరుతో జలదోపిడీకి తెరలేపుతూ రహస్యంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. గత ఎనిమిది నెలలుగా ఈ పనులు జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడం, విషయం తెలిసిన తర్వాత కూడా కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు నిద్రమత్తులో ఉన్నట్లు వ్యవహరిస్తున్నారని, ఈ జలదోపిడీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కృష్ణా నదీ జలాల విషయంలో విభజన చట్టాన్ని అమలు చేసి తెలంగాణకు రావాల్సిన నీటి వాటాను తేల్చాలని కోరారు. తెలంగాణకు చెందిన బీజేపీ మంత్రులు, ఎంపీలు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల' నినాదంతో సాధించుకున్న తెలంగాణలో జలదోపిడీని సహించేది లేదని, ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎనిమిది నెలలుగా పనులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. వీర్లపాలెంలో ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులను అరెస్టు చేసి, పోలీసు బందోబస్తు మధ్య కార్యక్రమాన్ని నిర్వహించడం అమానుషమని మండిపడ్డారు. గిరిజన, దళిత వర్గాలు నివసించే ప్రాంతాల సమీపంలో కాలుష్యకారక పరిశ్రమలను ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఫార్మా కంపెనీల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వీర్లపాలెంలో ఇథనాల్ పేరుతో నిర్మిస్తున్న పరిశ్రమను వెంటనే నిలిపివేసి, ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల జీవనహక్కులు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు.

మొదటి పేజీ తరువాయి అణు ముప్పు తగ్గింపుపై చర్చలకు అగ్రరాజ్యాల నిర్ణయం

ఈ భేటీ అనంతరం వారు నాలుగు ప్రధాన అంశాలతో కూడిన ఉమ్మడి ప్రకటనను విడుదల చేశారు. అణుయుద్ధంలో ఎవరూ విజయం సాధించలేరని, అలాంటి యుద్ధం ఎప్పటికీ సంభవించకూడదని ముగ్గురు నేతలు తమ ప్రకటనలో స్పష్టం చేశారు. అణ్వాయుధాల విస్తరణను నిరోధించడం, అణు ప్రమాదాలను తగ్గించడం కోసం పరస్పరం చర్చలు కొనసాగించాలని వారు అంగీకరించారు. అయితే, తమ దేశాల్లోని అణ్వాయుధాల సంఖ్యను తగ్గించేందుకు ఎటువంటి నిర్దిష్ట లక్ష్యాలను వారు ప్రకటించలేదు. వీటితోపాటు ఐక్యరాజ్యసమితిలో సంస్కరణల ఆవశ్యకతను కూడా నేతలు నొక్కిచెప్పారు. ప్రపంచ శాంతి, భద్రతలకు ఎదురవుతున్న సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా ఐరాసను తీర్చిదిద్దాలని వారు అభిప్రాయపడ్డారు. అలాగే, శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాను పెంచేందుకు కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి ముందు ట్రంప్.. పుతిన్, జిన్‌పింగ్‌లతో విడివిడిగా భేటీ అయ్యారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఫెంటానిల్ సంక్షోభం వంటి కీలక అంశాలపై జిన్‌పింగ్‌తో చర్చించినట్లు సమాచారం. అయితే, ఈ ఉమ్మడి ప్రకటనలో ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాల ప్రస్తావన లేకపోవడం గమనార్హం. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు వంటి సంస్థలు తమ అధికార పరిధిని దుర్వినియోగం చేయకూడదని కూడా ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

యాదగిరిగుట్టలో వైభవంగా ప్రారంభమైన సహస్రనామావళి సహిత కోటి పుష్పార్చన



(యాదాద్రి భువనగిరి, సాక్షర): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న కార్తీక వైభవోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీ స్వామివారి సహస్రనామావళి సహిత కోటి పుష్పార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముందుగా దేవస్థాన అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా అంతరాలయంలో శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆరాధనలు నిర్వహించారు. అనంతరం కోటి పుష్పార్చన కోసం భక్తిశ్రద్ధలతో సేకరించిన వివిధ రకాల పుష్పాలను ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసి స్వామివారికి పూజలు నిర్వహించారు. తదుపరి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, వేదమంత్రోచ్చారణల నడుమ శోభాయమానంగా ఊరేగింపు సేవ నిర్వహించారు. ఈ ఊరేగింపు ఆలయ మాడవీధుల మీదుగా కొనసాగి, అక్కడ ఏర్పాటు చేసిన కోటి పుష్పార్చన మండప ప్రాంగణానికి చేరుకుంది. సహస్రనామావళి పారాయణంతో కోటి పుష్పార్చన పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ పవిత్ర కార్యక్రమంలో వేద పండితులు, వేద విద్యార్థులు, దేవస్థానం సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు స్వామివారికి సమర్పించేందుకు తీసుకువచ్చిన పుష్పాలను భక్తిశ్రద్ధలతో అందజేసి పుష్పార్చనలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, దేవస్థాన కార్యనిర్వహణాధికారి జె. భవానీ శంకర్, డీఈవో దొర్బాల భాస్కర్ శర్మ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తీరం దాటిన 'అక్వాన్' తుపాను..



బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీరం దాటింది. ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో ఈ ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య తుపాను తీరాన్ని తాకినట్లు వాతావరణ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. తుపాను తీరం దాటే సమయంలో తీర ప్రాంతంలో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచాయని, అప్పుడప్పుడు వీటి తీవ్రత గరిష్ఠంగా 90 కిలోమీటర్ల వరకు నమోదైందని అధికారులు తెలిపారు. తీరం దాటిన అనంతరం తుపాను ఉత్తర-ఈశాన్య దిశగా ఒడిశా మీదుగా కదులుతోంది. ఇది రాగల మూడు గంటల్లో తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాతి ఆరు గంటల్లో సాధారణ వాయుగుండంగా మరింత బలహీనపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు దక్షిణ ఒడిశాలో విస్తారంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అత్యధికంగా 168.75 మి.మీ, అరకభద్రలో 162.50 మి.మీ, కంచిలిలో 148.50 మి.మీ వర్షపాతం నమోదైంది. తుపాను దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే ముందుజాగ్రత్తగా పలు రైళ్లను రద్దు చేసింది. ఒడిశా ప్రభుత్వం లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తుపాను బలహీనపడుతున్నప్పటికీ, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం తదితర ప్రాంతాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

మొదటి పేజీ తరువాయి బీఆర్ఎస్ మాకు ప్రధాన శత్రువు.. బీజేపీ పోటీ కాదు: సీఎం రేవంత్ రెడ్డి

కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల కోసం పనిచేస్తోందన్నారు. ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యకు బర్త్‌డే విషెస్: ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య 100వ పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈరోజు విద్యానగర్‌లోని రామయ్య నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి.. ఆయనకు విషెస్ తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో అందే విద్య.. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అందించాలని నిర్ణయించామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోని 27 లక్షల విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం కూడా పెరిగిందన్నారు. పదో తరగతి తర్వాత డ్రాప్ అవుట్స్ బాగా ఉన్నాయని చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడం కోసం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని అన్నారు. మా విద్యార్థులు సంస్థలను స్థాపించాలని కోరుకుంటున్నా..: స్కిల్స్ యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా వ్యవహరిస్తున్నారని.. ఇక్కడ చదువుకునే వాళ్లకు వంద శాతం ఉద్యోగాలు లభిస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఐటీఐల్లో పాతకాలం చదువులే కొనసాగుతున్నాయని.. అందుకే ఐటీసీలుగా మార్చామని వివరించారు. ఐటీసీల కోసం నాలుగు వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని.. ఇందులో టాటా సంస్థ 86 శాతం ఖర్చు పెడుతోందని అన్నారు. తెలంగాణ విద్యార్థులు సంస్థల్లో పనిచేయడం కాదని.. సంస్థలనే స్థాపించాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ లాంటి అంతర్జాతీయ విద్యా సంస్థలు తెలంగాణలో తమ క్యాంపస్‌లు ఏర్పాటు చేయబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకురాలు రేఖా నాయక్ ఇళ్లలో ఈడీ సోదాలు

962 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు స్పష్టంగా తేలింది. ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.40.96 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. రేఖా నాయక్‌పై గతంలోనే BNS సెక్షన్లు 316(2), 316(5), 318(4), నిత్యావసర సరుకుల చట్టం కింద కేసు నమోదు అయింది. ధాన్యం గోల్‌మాల్‌లో మనీలాండరింగ్ కోణంపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. పక్కదారి పట్టించిన ధాన్యం ద్వారా సమకూరిన అక్రమ నిధులను ఎక్కడికి మళ్లించారు, వాటిని ఏయే ఆస్తుల్లో పెట్టుబడిగా పెట్టారు అనే వివరాలపై ఆరా తీస్తున్నారు. తనిఖీల్లో భాగంగా బ్యాంకు ఖాతాల వివరాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సోదాలు పూర్తయిన అనంతరం ఈ వ్యవహారంలో మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

మొదటి పేజీ తరువాయి రేవంత్ కు రాజగోపాలరెడ్డి కౌంటర్

ఇచ్చిన హామీలను అమలు చేసేలా ధర్మంగా, నిజాయితీగా పాలన సాగించేలా ముఖ్య నేతలకు సద్బుద్ధి, ఆత్మ పరిశీలనా జ్ఞానాన్ని ప్రసాదించాలని ఆ అయ్యప్ప స్వామిని వేడుకుంటున్నానంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు.మునుగోడు ఎమ్మెల్యే తన పోస్టులో ఎవరి పేరును ప్రస్తావించకపోయినప్పటికీ.. ముఖ్య నేతలకు అని ప్రస్తావించడం ద్వారా సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారనే భావన వ్యక్తం అవుతోంది.అంతకు ముందు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఓ సభలో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 'నువ్వే ముఖ్యమంత్రి. నీ భాషేంటి?' అని ప్రశ్నించిన కోమటిరెడ్డి.. కొడంగల్‌కు వేల కోట్లు నిధులు పట్టుకుపోతానని సీఎం అంటున్నారని.. మరి మునుగోడుకు నిధులు అడగొద్దా అని ప్రశ్నించారు. మూడేళ్ల పాలన పట్ల ఎవరూ సంతోషంగా లేరన్నారు.ఈ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చినట్లుగా సిద్ధిపేట సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. నిన్న మొన్న మా వాళ్లు ఒకరిద్దరికి ఏమైందో.. ఎర్రి కుక్క కరిసిందేమో.. చెడును మైకులో చెబుతున్నారన్న సీఎం.. మంచిని మైకులో చెప్పి, చెడును చెవిలో చెప్పాలని సూచించారు. అయితే చెడును చెప్పాలని అంటూనే సొంత పార్టీ నేతలను ఉద్దేశించి ఎర్రోళ్లు, ఎర్రి కుక్క కరిసినోళ్లు అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు కొంత ఇబ్బందికరంగా ఉన్నాయనే భావన వ్యక్తం అవుతోంది.ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అధిష్టానం గమనిస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఇదివరకే ప్రకటించారు. అయినా సరే రాజగోపాల్ రెడ్డి మాత్రం వెనక్కి తగ్గడం లేదు. మంత్రి పదవి రాలేదని చాలా కాలంగా అసంతృప్తితో ఉన్న ఆయన.. ఇటీవల కాంట్రాక్టుల విషయంలోనూ ఆరోపణలు చేశారు. మొత్తానికి పరిస్థితి చూస్తుంటే.. తెలంగాణ కాంగ్రెస్‌లో ఇంటిపోరు మరింత ముదిరేలానే కనిపిస్తోంది.

మొదటి పేజీ తరువాయి అమెరికాలో అత్యంత అరుదైన చేప.. 69 నుంచి 137కు పెరిగిన 'డెవిల్స్ హోల్ పప్‌ఫిష్'

అమెరికాలోని నెవడాలో ఉన్న డెవిల్స్ హోల్ అనే ఒకే ఒక్క సహజ ఆవాసంలో నిర్వహించిన తాజా సర్వేలో ఈ చేపల సంఖ్య 137గా తేలింది. గతేడాది ఇదే సమయంలో కేవలం 69 చేపలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి జనాభా రెట్టింపు కావడం ఆశాజనకంగా మారింది. అమెరికా నేషనల్ పార్క్ సర్వీస్, యూఎస్ ఫిష్ అండ్ వైల్డ్‌లైఫ్ సర్వీస్‌కు చెందిన జీవశాస్త్రవేత్తలు అక్టోబర్ 10న ఈ సర్వే నిర్వహించారు. డెత్ వ్యాలీ నేషనల్ పార్క్‌లో ఉన్న డెవిల్స్ హోల్ అనే సున్నపురాతి గుహలోని నీటిలో డైవర్లు, ఇతర పరిశీలకుల బృందం ఈ లెక్కింపు చేపట్టింది. 2025 పతనంలో 69గా, 2026 వసంతకాలంలో 77గా ఉన్న ఈ చేపల సంఖ్య ఇప్పుడు ఏకంగా 137కు చేరడం ఒక గొప్ప విజయంగా అధికారులు అభివర్ణించారు. 1972 నుంచి ఇదే పద్ధతిలో ఇక్కడ సర్వే నిర్వహిస్తున్నారు. "గత ఏడాదితో పోలిస్తే పప్‌ఫిష్‌ల సంఖ్య గణనీయంగా పెరగడం చాలా ఆనందంగా ఉంది. ఈ అద్భుతమైన జాతిని కాపాడేందుకు మా శాస్త్రవేత్తలు, భాగస్వాములు పడుతున్న కఠోర శ్రమకు ఈ ఫలితాలు నిదర్శనం" అని డెత్ వ్యాలీ నేషనల్ పార్క్ సూపరింటెండెంట్ మైక్ రేనాల్డ్స్ తెలిపారు. ఎందుకింత ప్రత్యేకం?: డెవిల్స్ హోల్ పప్‌ఫిష్ (శాస్త్రీయ నామం: సైప్రినోడాన్ డయాబోలిస్) ప్రపంచంలో మరెక్కడా కనిపించదు. ఈ గుహలోని 215 చదరపు అడుగుల వైశాల్యం ఉన్న ఒక సున్నపురాతి అంచుపై మాత్రమే ఇవి జీవిస్తాయి. ఇక్కడి 90-93 డిగ్రీల ఫారెన్‌హీట్ ఉష్ణోగ్రత ఉన్న నీటిలో పెరిగే నాచును తింటూ, అక్కడే సంతానోత్పత్తి చేస్తాయి. పరిమిత ఆక్సిజన్, పోషకాలు ఉన్న ఈ వాతావరణంలో జీవించడం వీటి ప్రత్యేకత. ఈ కారణాల వల్లే 1967లోనే ఈ జాతిని అంతరించిపోతున్న జీవిగా ప్రకటించారు. 2024 డిసెంబర్, 2025 ఫిబ్రవరి నెలల్లో సంభవించిన భూకంపాలు ఈ చేపల ఆవాసాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. భూకంపాల వల్ల ఏర్పడిన అలలు నీటిలోని నాచును, చేపల గుడ్లను కొట్టుకుపోయేలా చేశాయి. దీంతో 2025 మార్చి నాటికి వీటి సంఖ్య కేవలం 20కి పడిపోయింది. స్పందించిన శాస్త్రవేత్తలు, యాష్ మెడోస్ ఫిష్ కన్జర్వేషన్ ఫెసిలిటీలో పెంచిన 72 చేపలను 2025 మార్చి నుంచి 2026 ఫిబ్రవరి మధ్యలో డెవిల్స్ హోల్‌లోకి విడుదల చేశారు. సహజ సిద్ధమైన నాచు పెరిగే వరకు వీటికి అదనపు ఆహారాన్ని కూడా అందించారు. ఈ చేపల జీవితకాలం 10 నుంచి 14 నెలలు మాత్రమే కావడంతో, ప్రస్తుతం లెక్కించిన 137 చేపలలో ఎక్కువ భాగం సహజంగానే డెవిల్స్ హోల్‌లో పుట్టి పెరిగాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయినప్పటికీ, వీటి ఆవాసం చాలా పరిమితం కావడంతో భూకంపాలు, నీటి మట్టంలో మార్పుల వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.


ప్రారంభ దశలోనే పైల్స్‌ను గుర్తిస్తే మందులతోనే నియంత్రణ



• కరీంనగర్ మెడికవర్‌లో అత్యాధునిక లేజర్ చికిత్స అందుబాటులో.. వారం రోజుల పాటు ఉచిత వైద్య సంప్రదింపులు

(కరీంనగర్, సాక్షర): పైల్స్ సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన వైద్య చికిత్స తీసుకుంటే చాలా సందర్భాల్లో శస్త్రచికిత్స అవసరం లేకుండానే నియంత్రించవచ్చని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. రోగి ఆరోగ్య పరిస్థితి, వ్యాధి తీవ్రతను బట్టి మందులు, ఆహార నియమాలు, జీవనశైలి మార్పులతో పాటు అవసరమైన వారికి అత్యాధునిక లేజర్ చికిత్స, శస్త్రచికిత్స అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. శుక్రవారం ప్రపంచ పైల్స్ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సులో జనరల్ సర్జన్ డాక్టర్ తాహా, అనెస్థీషియా విభాగాధిపతి డాక్టర్ వినయ్ మాట్లాడారు. పైల్స్ సమస్యపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, ప్రారంభ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మలద్వారం వద్ద రక్తస్రావం, నొప్పి, మంట, దురద, వాపు, గడ్డలు ఏర్పడటం వంటి లక్షణాలు కనిపిస్తే మొహమాటం లేకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. మలబద్ధకం, ఆహారంలో పీచు పదార్థాలు తక్కువగా తీసుకోవడం, తగినంత నీరు తాగకపోవడం, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో పైల్స్ సమస్య వచ్చే అవకాశం ఉందని వివరించారు. ముఖ్యంగా టాయిలెట్‌లో సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని, ఎక్కువసేపు కూర్చునే అలవాటును మానుకోవాలని సూచించారు. సమస్యను మసాలా ఆహారం లేదా మద్యం వల్ల వచ్చిందని భావించి నిర్లక్ష్యం చేయకుండా, సొంత వైద్యం చేసుకోకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని తెలిపారు.ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా పైల్స్ సమస్యను నివారించవచ్చని వైద్యులు సూచించారు. అవసరమైన రోగులకు ఆధునిక లేజర్ చికిత్స అందుబాటులో ఉందని, చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిని బట్టి త్వరగా ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రపంచ పైల్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో వారం రోజుల పాటు పైల్స్ సమస్యతో బాధపడేవారికి ఉచిత వైద్య సంప్రదింపులు నిర్వహించనున్నట్లు వైద్యులు ప్రకటించారు.ఈ కార్యక్రమం ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరగగా, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, మెడికల్ హెడ్ డాక్టర్ ప్రియాంక, ఆర్ఎంఓ డాక్టర్ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కోయిల్ సాగర్ ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ ధర్నా.. నీటి తరలింపు ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్



మహబూబ్‌నగర్ : జిల్లాలోని కోయిల్ సాగర్ నుంచి కొడంగల్‌కి నీటి తరలింపు ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రాజెక్టు వద్ద దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం ధర్నా (నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం నియోజకవర్గం కోసం కోయిల్ సాగర్ రైతుల పొట్టకొట్టొద్దని కోరారు. కోయిల్ సాగర్ మీద కుట్ర జరుగుతుందని 20 రోజుల ముందే హెచ్చరించామని వెల్లడించారు. కొడంగల్ కి నీటి తరలింపుకు టెండర్లు కూడా పిలిచారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కు రైతుల మీద ప్రేమ ఉంటే ఈ ప్రాజెక్ట్ ముందుకు వెళ్ళేది కాదని అన్నారు. వర్షాకాలం పంటలకు కూడా నీళ్లు ఇవ్వలేకపోయిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. ఇప్పటికే కోయిల్ సాగర్ పై ఒత్తిడి ఎక్కువగా ఉందని ఇప్పటికైన సీఎం రేవంత్ రెడ్డి కోయిల్ సాగర్ ఆయకట్టు రైతుల పక్షాన కోరుతున్నామని, నీటి తరలింపు ప్రతిపాదనను విరమించుకోవాలని సూచించారు . లేనిపక్షంలో రైతుల పక్షాన నీళ్ల కోసం ఉద్యమిస్తామని, కొడంగల్‌కు నీళ్ల తరలింపును అడ్డుకుంటామని స్పష్టం చేశారు. వాగుల్లో ఇసుక దోపిడి మీద వున్న శ్రద్ధ రైతులకు నీళ్లు ఇవ్వడంలో లేదని తెలిపారు. కోయిల్ సాగర్ నిండాలని కరివెన రిజర్వాయర్ నుంచి కెనాల్ డిజైన్ చేశామని, మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం నుండి కొడంగల్ కి తాగునీటి అవసరాలకు వాడుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కమీషన్ల కోసం రైతుల నోట్లో మట్టికొడుతున్నారని ఆరోపించారు.

మొదటి పేజీ తరువాయి టెక్ వైఫల్యాల ఎఫెక్ట్..

గత వారం రోజులుగా అమెరికాను పలు టెక్నికల్ సమస్యలు అతలాకుతలం చేశాయి. దేశవ్యాప్తంగా విమాన సేవలు గంటల తరబడి నిలిచిపోవడం, మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయం కారణంగా ఈ-మెయిల్, బ్యాంకింగ్ వ్యవస్థలు స్తంభించడం తీవ్ర గందరగోళానికి దారితీసింది. చివరకు అత్యంత కీలకమైన జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఎస్ఏ) నెట్‌వర్క్‌లో కూడా తాత్కాలికంగా సమస్యలు తలెత్తడం తీవ్ర కలకలం రేపింది. ఈ వరుస వైఫల్యాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే కెయిన్‌క్రాస్‌ను పదవి నుంచి తొలగించారని వైట్‌హౌస్ ప్రతినిధి ఒకరు మీడియాకు వెల్లడించారు. "సీన్ కెయిన్‌క్రాస్‌ను తొలగించడానికి అధ్యక్షుడు పూర్తి మద్దతు ఇచ్చారు" అని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో సైబర్ భద్రతా విధానాలు, వ్యూహాలను పర్యవేక్షించడం కెయిన్‌క్రాస్ ప్రధాన బాధ్యత. ఆయన స్థానంలో రక్షణ శాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (సీఐఓ) కిర్‌స్టెన్ డేవిస్ తాత్కాలికంగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అయితే, తన తొలగింపుపై స్పందించేందుకు కెయిన్‌క్రాస్ నిరాకరించారు. ఒకే వారంలో విమానయానం నుంచి జాతీయ భద్రత వరకు కీలక రంగాల్లో సాంకేతిక వైఫల్యాలు చోటుచేసుకోవడం ట్రంప్ యంత్రాంగంపై తీవ్ర ఒత్తిడి పెంచింది. ఈ నేపథ్యంలో సైబర్ భద్రత విషయంలో ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరించనుందో కెయిన్‌క్రాస్ తొలగింపు స్పష్టమైన సంకేతమిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

రేవంత్ రెడ్డికి కేసీఆర్ అంటే భయం పట్టుకుంది : హరీశ్ రావు



(మెదక్, సాక్షర): రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అంటే భయం పట్టుకుందని భయంతోనే వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ మెదక్ జిల్లా రామయంపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి, రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాదే, చంద్రం, మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె, జితేందర్ గౌడ్, సీనియర్ నాయకులు సుప్రభాత్‌రావు, కౌన్సిలర్ కొక్కు ప్రవీణ్, నాయకులు ఉమామహేశ్వర్, ఆసనోదిన్, అహ్మద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణే ప్రధాన డిమాండ్..



• ఒప్పంద అధ్యాపకుల ఐక్యతా గళం

(కరీంనగర్, సాక్షర): తెలంగాణ రాష్ట్రంలోని 12 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఏళ్లుగా సేవలందిస్తున్న ఒప్పంద అధ్యాపకుల (కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల) ఉద్యోగాలను తక్షణమే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ శాతవాహన యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకులు మానవహారం నిర్వహించారు. యూనివర్సిటీ ఆవరణలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో అధ్యాపకులంతా పెద్ద ఎత్తున పాల్గొని తమ ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాల బోధన, పరిశోధన, పరీక్షల నిర్వహణలో తాము కీలక పాత్ర పోషిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని, నూతన నియామకాల కంటే ముందే తమకు ఉద్యోగ భద్రత కల్పించి క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల అధ్యక్ష కార్యవర్గ సభ్యులైన డాక్టర్ మనోజ్ డాక్టర్ రమేష్ రెడ్డి డాక్టర్ తిరుపతి డాక్టర్ రాజు డాక్టర్ కిరణ్ వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అత్యవసరంగా నిర్ణయం తీసుకోండి.. బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్ కోసం షేక్ హసీనా దరఖాస్తు



• కొత్త పాస్‌పోర్ట్, జాతీయ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసిన షేక్ హసీనా

• ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు లేఖ రాసిన లండన్ న్యాయవాది స్టీవెన్ పౌల్స్

• మరణశిక్ష పడిన ఖైదీకి పాస్‌పోర్ట్ ఇచ్చేది లేదన్న బంగ్లాదేశ్ అధికారులు

ఢిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కొత్త పాస్‌పోర్ట్, జాతీయ గుర్తింపు కార్డు (ఎన్ఐసీ) కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు న్యూఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు ఆమె తరఫు న్యాయవాది అధికారికంగా లేఖ రాశారు. మీడియా కథనాల ప్రకారం... లండన్‌కు చెందిన ప్రముఖ బారిస్టర్ స్టీవెన్ పౌల్స్ ద్వారా హసీనా ఈ దరఖాస్తును సమర్పించారు. నవంబర్ 9న పంపిన తొలి విజ్ఞప్తికి స్పందన రాకపోవడంతో, నవంబర్ 19న ఆయన మరోసారి హైకమిషన్‌కు ఫాలో-అప్ లేఖ పంపారు. హసీనా స్వయంగా సంతకం చేసిన అధికార పత్రాన్ని (ఆథరైజేషన్ లెటర్) కూడా జతచేస్తూ, అత్యవసరంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. 2024లో చెలరేగిన ప్రజా ఉద్యమం వల్ల భారత్‌కు వచ్చిన షేక్ హసీనా... డిసెంబర్‌లో స్వదేశానికి తిరిగి వెళ్లాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రద్దయిన పత్రాల స్థానంలో కొత్త పాస్‌పోర్ట్, ఐడీ కార్డు కోసం ఆమె ప్రయత్నిస్తున్నారు. మరోవైపు, హసీనా విజ్ఞప్తిని బంగ్లాదేశ్ ప్రభుత్వం తోసిపుచ్చింది. మానవతా వ్యతిరేక నేరాల కేసులో న్యాయస్థానం ఆమెకు మరణశిక్ష విధించిందని, పైకోర్టులో అప్పీల్ చేసుకునే గడువు కూడా ఇప్పటికే ముగిసిందని అధికారులు తెలిపారు. ఆమె ఒక దోషి అని, ఎలాంటి పరిస్థితుల్లోనూ కొత్త పాస్‌పోర్ట్ జారీ చేయబోమని బంగ్లాదేశ్ చీఫ్ ప్రాసిక్యూటర్ అమీనుల్ ఇస్లాం, న్యాయశాఖ మంత్రి స్పష్టం చేశారు. భారత్‌తో ఉన్న ద్వైపాక్షిక నేరస్థుల అప్పగింత ఒప్పందం ద్వారానే ఆమెను రప్పించి, చట్టపరంగా శిక్షను అమలు చేస్తామని బంగ్లాదేశ్ వర్గాలు పేర్కొన్నాయి.

మొదటి పేజీ తరువాయి జనాభాతో పాటు జీడీపీ ప్రాతిపదిక కావాలి

పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్ కళాశాలలు దూరంగా ఉండటంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్న పరిస్థితిని అధిగమించేందుకు ఇంటర్మీడియట్ విద్యను స్కూల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి తీసుకువచ్చే దిశగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆనంద్ మహీంద్రా గారి చైర్మన్‌షిప్‌లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, పాతకాలపు కోర్సులకు స్వస్తి పలికి ఐటీఐలను ఆధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) అభివృద్ధి చేస్తున్నామని ప్రస్తావించారు. ప్రపంచస్థాయి విద్యను తెలంగాణలో అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు తెలంగాణలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయనున్నాయని వెల్లడించారు. విద్యతో పాటు క్రీడారంగ అభివృద్ధికి, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇస్తోందని, ఇందులో 8 వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని వెల్లడించారు. ఇప్పటికే ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని తెలంగాణకు తీసుకువచ్చామని, పోర్చుగల్ స్టార్ ఫుట్‌బాలర్ క్రిస్టియానో రొనాల్డోను కూడా రాష్ట్రానికి ఆహ్వానించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. మెస్సీ తన అభిమాన క్రీడాకారుడని, గతంలో అర్జెంటీనా దిగ్గజం డిగో మారడోనా కూడా తన అభిమాన ఆటగాడని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి ముందు కేబినెట్ ఖాళీలను భర్తీ చేయండి

సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే మంత్రి పదవులు ఇస్తామంటూ ముఖ్యమంత్రి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆయన సెటైర్లు వేశారు. "రేవంత్ రెడ్డి మానసిక స్థితి సరిగా ఉందో లేదో అర్థం కావడం లేదు. మొన్న సిరిసిల్ల పోయి అక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తాను అన్నాడు. నిన్న సిద్దిపేట పోయి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తాను అంటున్నాడు. నీ కేబినెట్‌లోనే 3 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి.. ముందు వాటిని భర్తీ చెయ్యి" అని అన్నారు. ఖాళీగా ఉన్న మంత్రి పదవులు ఇవ్వడానికే రేవంత్ కు లాగు తడుస్తోందని ఎద్దేవా చేశారు. ఎవరికి మంత్రి పదవి ఇస్తే ఏ ఎమ్మెల్యే వెళ్లపోతాడో అని భయపడుతున్నారని అన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో ఇప్పటికే ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులను భర్తీ చేయలేని స్థితిలో ఉన్న ముఖ్యమంత్రి... భవిష్యత్తు ఎన్నికల్లో గెలిస్తే పదవులు ఇస్తామని చెప్పడం సరికాదని ఆయన విమర్శించారు. కేబినెట్ విస్తరణ చేపడితే పార్టీలోని ఇతర ఎమ్మెల్యేలు చేజారిపోతారనే భయంతో ముఖ్యమంత్రి ఉన్నారని అన్నారు.

మొదటి పేజీ తరువాయి స్టాండ్ విత్ జెన్సెన్ కు భారీగా మద్దతు

ఈ పిటిషన్‌పై తాను కూడా సంతకం చేస్తున్నట్లు మస్క్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. 'స్టాండ్ విత్ జెన్సెన్' అనే వాలంటీర్ల వెబ్‌సైట్ ద్వారా ఎన్విడియా బోర్డుకు రాసిన బహిరంగ లేఖపై ఇప్పటివరకు 43,000 మందికి పైగా సంతకాలు చేయడం విశేషం. ప్రతి 30 సెకన్లకు అప్‌డేట్ అయ్యే ఈ సైట్ వివరాల ప్రకారం, సంతకం చేసిన వారిలో 2,980 మంది ప్రస్తుత ఎన్విడియా ఉద్యోగులు, 454 మంది మాజీ ఉద్యోగులు, 24,097 మంది వాటాదారులు, 15,517 మంది ఇతర మద్దతుదారులు ఉన్నారు. అయితే ఈ ప్రచారానికి ఎన్విడియా గానీ, హువాంగ్ గానీ మద్దతు ఇవ్వలేదని, సంతకం చేసిన వారి హోదాలు సెల్ఫ్ అటెస్టెడ్ మాత్రమేనని నిర్వాహకులు తెలిపారు.ఎలాంటి సరైన విచారణ ప్రక్రియ లేకుండానే హువాంగ్‌ను తొలగించారని, వివాదంలో ఉన్న మహిళ గూఢచారి అనడానికి బోర్డు ఎలాంటి ఆధారాలు చూపలేదని ఈ లేఖలో పేర్కొన్నారు. కేవలం అనుమానాలు లేదా పరిచయాల ఆధారంగా జెన్సెన్ నాయకత్వం నుంచి తొలగించడం సరికాదని పేర్కొంటూ, స్వతంత్ర దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆయనను తిరిగి ఎన్విడియా సీఈఓగా నియమించాలని లేదా ఆయన లేకపోవడం సంస్థకు ఎలా మేలు చేస్తుందో పూర్తి వివరాలతో వివరించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రచారంలో మస్క్‌తో పాటు ఎపిక్ గేమ్స్ సీఈఓ టిమ్ స్వీనీ, వై కాంబినేటర్‌కు చెందిన గ్యారీ టాన్, రెప్లిట్ సీఈఓ అమ్జాద్ మసాద్, కోహెరేకు చెందిన ఐడాన్ గోమెజ్, పెట్టుబడిదారుడు గావిన్ బేకర్, బైనాన్స్ సహ వ్యవస్థాపకురాలు యి హి వంటి టెక్ ప్రముఖులు సైతం సంతకాలు చేశారు.మరోవైపు ఎన్విడియా ఉద్యోగులు సైతం హువాంగ్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. సీనియర్ ఇంజనీర్ ఎర్విన్ కూమన్స్ స్పందించారు. హువాంగ్ వ్యక్తిగత జీవితంతో తమకు సంబంధం లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే మాత్రమే చర్యలు తీసుకోవాల్సిందే కానీ ఆయనకు న్యాయ విచారణ అవకాశం ఇవ్వాలని కోరారు. తప్పులు చేసిన వారిని ఉద్యోగం నుండి తొలగించకుండా నేర్చుకునే అవకాశం ఇవ్వాలని జెన్సెన్ ఎప్పుడూ చెప్పేవారని, ఇప్పుడు ఆయనకు అదేవిధంగా మర్యాద ఇవ్వాలని సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్ ఎలియాస్ సేయుమ్ అభిప్రాయపడ్డారు. కాగా, హువాంగ్ పట్ల వ్యతిరేకత లేదా ఎగతాళి చేసే వ్యాఖ్యలున్న సంతకాలను నిర్వాహకులు తిరస్కరిస్తున్నారు. సంస్థ అంతర్గత సలహా వేదికపై కూడా 1,600 మందికి పైగా ఉద్యోగులు హువాంగ్ రీఎంట్రీకి మద్దతుగా కామెంట్లు పెట్టారని, ఆయన ఎగ్జిట్ అవ్వడాన్ని సమర్థిస్తూ ఒక్క పోస్ట్ కూడా కనిపించలేదని వైర్డ్ రిపోర్ట్ పేర్కొంది.చైనా కోసం గూఢచర్యం చేస్తోందని అమెరికా నిఘా సంస్థలు అనుమానిస్తున్న మెగాస్పీడ్ ఎగ్జిక్యూటివ్ ఆలిస్ హువాంగ్‌తో మాజీ సీఈవో జెన్సెన్‌కు సంబంధం ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీనిపై నవంబర్ 8న ఉద్యోగులకు పంపిన మెమోలో తాను తన భార్యకు నమ్మకద్రోహం చేశానని హువాంగ్ అంగీకరించారు. ఆ తర్వాత నేరుగా ఆయనకు రిపోర్ట్ చేసే ఎన్విడియా హెల్త్‌కేర్ వైస్ ప్రెసిడెంట్ కింబర్లీ పావెల్‌తో పాటు మరో ఉద్యోగినితో కూడా ఆయనకు వివాహేతర సంబంధాలు ఉన్నట్లు ప్రచారం చేయడంతో నవంబర్ 12న హువాంగ్ ఎన్విడియా ప్రెసిడెంట్, సీఈఓ, బోర్డు మెంబర్ పదవులకు తక్షణమే రాజీనామా చేశారు.

పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలి

• జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



(మంచిర్యాల ప్రతినిధి, సాక్షర) పెండింగ్ పనులపై దృష్టి సారించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శుక్రవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామంలో నిర్వహించిన రీసర్వే గ్రామసభలో మండల తహసీల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థులకు రీసర్వే ప్రాముఖ్యతను వివరించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. రీసర్వే ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు గ్రామస్థులు తమ పూర్తి సహకారం అందించాలని, తద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కలుగుతుందని, భవిష్యత్తులో భూ వివాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. మండలంలోని లింగాపూర్ గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను తహసిల్దార్‌తో కలిసి పరిశీలించారు. సర్వేయర్, లైసెన్స్‌డ్ సర్వేయర్, సంబంధిత పట్టాదారుల సమక్షంలో సర్వే పురోగతిని సమీక్షించి, నిర్దేశిత గడువులోగా రీసర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రీసర్వే, ఎల్ఏ మ్యుటేషన్, కోర్టు కేసులు, జి.ఓ. ఎం.ఎస్. నంబర్లు 76, 59, ఎస్ఐఆర్, భూభారతి, మీ సేవ పెండింగ్ సర్టిఫికెట్లు, వరి ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఐకెపీ సిబ్బంది, తహసిల్దార్ సమన్వయంతో పనిచేస్తూ కొనుగోళ్లను సజావుగా, సకాలంలో నిర్వహించాలని సూచించారు.మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ రైస్ డిపోను ఆకస్మికంగా తనిఖీ చేసి, అందుబాటులో ఉన్న బియ్యం నిల్వలు, విక్రయ ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బియ్యం నిల్వలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యాన్ని విక్రయించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.అనంతరం హాజీపూర్ తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రీసర్వే, ఎల్ఏ మ్యుటేషన్, పెండింగ్ కోర్టు కేసులు, జాతీయ రహదారి భూసేకరణకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ పరిహారం, జి.ఓ. ఎం.ఎస్. నంబర్ 59, ఎస్ఐఆర్, భూభారతి, మీ సేవ సర్టిఫికెట్ల పురోగతిని సమీక్షించారు. పెండింగ్ కోర్టు కేసులు, జాతీయ రహదారి భూసేకరణ పరిహారం చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశాలలో సిసిఎల్ఎ ఆదేశాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులోగా పెండింగ్ పనులను పూర్తి చేయాలని తెలిపారు. మండలంలోని నమ్మూర్ గ్రామంలో కొనసాగుతున్న భూ పునఃసర్వే పనులను తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, సర్వేయర్, లైసెన్స్‌డ్ సర్వేయర్, సంబంధిత పట్టాదారుల సమక్షంలో సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. భూ పునఃసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా సర్వే పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సర్వే నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ, పట్టాదారుల సమక్షంలో భూ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పనులు చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల తహసిల్దార్లు, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

22 రోటిగూడ గీతామందిర్ లో ఉసిరిక వనభోజనాలు

(జన్నారం, సాక్షర): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఉసిరిక చెట్టు క్రింద భోజనాలు చేయడం సంప్రదాయమని ఆలయ నిర్వాహకుడు శ్రీహరి మౌనస్వామి తెలిపారు. ఈనెల 22 ఆదివారం మండలంలోని రోటిగూడ గీతామందిర్ లో సామూహిక ఉసిరిక వనభోజనాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకుడు శ్రీహరి మౌనస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఉసిరిక చెట్టు క్రింద భోజనాలు చేయడం సంప్రదాయం. అందులో భాగంగా ఈనెల 22 ఆదివారం రోజున ఉదయం 9-30 గంటలకు సామూహిక గీతాపారాయణం, 11-00 గంటలకు గీతాజయంతి పత్రిక కార్యక్రమం, 12 గంటలకు ఉసిరిక చెట్టు క్రింద సామూహిక భోజనాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఆ భగవంతుని ఆశీస్సులు పొందాలని ఆయన తెలిపారు.

పారదర్శకంగా క్వార్టర్ ల కేటాయింపు

• ఎస్ఓ టు జిఎం ఇ.స్వామి రాజు



(రెబ్బెన,సాక్షర) సింగరేణి ఉద్యోగులకు నివాస క్వార్టర్ ల కేటాయింపు కోసం నిర్వహించే కౌన్సెలింగ్ పారదర్శకంగా సాగుతుందని బెల్లంపల్లి ఏరియా ఎస్ఓ టు జిఎం ఇ.స్వామిరాజు అన్నారు. శుక్రవారం గోలేటి లోని ఏరియా జిఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగులకు నివాస క్వార్టర్ ల కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఓ టు జిఎం ఇ.స్వామిరాజు మాట్లాడుతూ కౌన్సెలింగ్ ద్వారా కేటాయించిన క్వార్టర్లను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగులకు కేటాయించిన నివాస క్వార్టర్ లను ఇతరులకు అద్దెకు ఇచినట్లు యాజమాన్యం దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఉద్యోగుల నివాస సముదాయాల వద్ద యాజమాన్యం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ డి.కిరణ్ బాబు,ఎస్ఈ (సివిల్)ఎస్.శ్రీధర్, సీనియర్ పర్సనల్ అధికారి ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

• అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా రక్షణ : ఎమ్మెల్యే పాయల్ శంకర్ అర్హులైన ప్రతి కుటుంబం పథకంలో నమోదు చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ రాజర్షి షా



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) ఆర్థికంగా వెనుకబడిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సామాజిక భద్రతతో పాటు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ను శుక్రవారం ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని యపల్ గూడ గ్రామంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, కుటుంబానికి అండగా నిలిచే ప్రధాన సంపాదనపరుడు అనుకోని పరిస్థితుల్లో మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఈ పథకం భరోసా కల్పిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నమోదు ప్రక్రియలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డులో ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించి అర్హులైన వారందరినీ పథకంలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.రేషన్ కార్డు ఉన్న కుటుంబాలతో పాటు రేషన్ కార్డు లేని కుటుంబాలు సైతం ఆధార్ ఓటీపీ ద్వారా కొత్తగా నమోదు చేసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. డేటా అందుబాటులో లేదనే కారణంతో ఏ ఒక్క అర్హుడినీ నమోదు శిబిరాల నుంచి వెనక్కి పంపించరాదని అధికారులకు సూచించారు. నమోదు శిబిరాల వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, విద్యుత్, ఇంటర్నెట్ వంటి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు జిరాక్స్, కుటుంబ సభ్యుల వివరాలు, నామినీ వివరాలతో శిబిరాలకు హాజరుకావాలని సూచించారు. ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను నమోదు చేసిన సందర్భంలో క్లెయిమ్ వాటాల మొత్తం 100 శాతంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పథకంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో డప్పు చాటింపు, ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజూ సాయంత్రం శిబిరాల్లో జరిగిన నమోదు వివరాలు, పురోగతిపై నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, ఎంపీడీవో వంశీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నజిమ, స్థానిక సర్పంచ్ నిరోస, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరైన సామాజిక సేవకులు సత్యరాజ్ ఉపారపు



(ఉట్నూర్, సాక్షర): నూతన గృహప్రవేశం సందర్భంగా ప్రొఫెసర్ జూనుగురు శ్రీనివాస్ కు శుభాకాంక్షలు తెలిపామని సామాజిక సేవకుడు సత్యరాజ్ ఉపారపు తెలిపారు.ఉట్నూర్ మండల కేంద్రంలోని పాత ఉట్నూర్ కి చెందిన ప్రొఫెసర్ జూనుగురు శ్రీనివాస్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి సామాజిక సేవకుడు, రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ సత్యరాజ్ ఉపారపు హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ కు శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన పార్లమెంట్ ఇంచార్జ్ దుర్గం శేఖర్

• ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా



(ఆదిలాబాద్, సాక్షర) ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని నూతన పార్లమెంట్ ఇంచార్జ్ దుర్గం శేఖర్ తెలిపారు.ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జిగా నియమితులైన టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ కులాల ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా బోరేకర్ సునీత కవల పిల్లలు రిమ్స్ ఆస్పత్రిలో చనిపోవడంతో మాట ఇచ్చి వారి కుటుంబ సభ్యులకు ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగం కల్పించి బాధిత కుటుంబానికి న్యాయం చేసిన కలెక్టర్ రాజర్షి షాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.దుర్గం శేఖర్ ప్రస్తావించిన సమస్యలపై కలెక్టర్ రాజర్షి షా సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా దుర్గం శేఖర్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని దుర్గం శేఖర్ తెలిపారు.

చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలి



(గుడిహత్నూర్, సాక్షర): ఆదివాసీల హక్కులు కాపాడుకోవాలంటే అందరూ ఒక్క తాటిపైకి రావాల్సిన సమయం వచ్చిందని, డిసెంబర్ 9 సభ ఆదివాసీ ఐక్యతకు చారిత్రక ఘట్టం కాబోతుందని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ అన్నారు.ఆదివాసీల హక్కుల సాధన, ఆదివాసీ అస్తిత్వ పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల అమలు లక్ష్యంగా డిసెంబర్ 9న హైదరాబాద్ లో నిర్వహించనున్న లక్షలాది మంది ఆదివాసీల భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ పిలుపునిచ్చారు.గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కొమురం భీం విగ్రహం వద్ద చలో హైదరాబాద్ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 9 తెగల ఆదివాసీ ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, ఆదివాసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.ఆదివాసీల హక్కులు కాపాడుకోవాలంటే అందరూ ఒక్క తాటిపైకి రావాల్సిన సమయం వచ్చిందని, డిసెంబర్ 9 సభ ఆదివాసీ ఐక్యతకు చారిత్రక ఘట్టం కాబోతుందని ఆయన అన్నారు.కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెందోర్ జలపతి, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్, ఆదివాసీ జెఏసి గుడిహత్నూర్ మండల చైర్మన్ ఉర్వేత రోహిత్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు మేస్రం మోహన్, ఆదివాసీ సేన జిల్లా కార్యదర్శి కుంరం చత్రుఘన్, రాజ్ గోండ్ సేవా సమితి మండల అధ్యక్షుడు కోవ భగవాన్, ఆదివాసి విద్యార్థి సంఘం ఇచ్చోడ మండల అధ్యక్షుడు నైతం పండరినాథ్, ఆదివాసీ సేన మండల ఉపాధ్యక్షుడు సలాం జాకు, గోండ్వానా రాయి సెంటర్ సార్మేడి కాళ్లె భరత్, ఉప సార్మేడి మేస్రం జంగు, మాజీ సార్మేడి పేందోర్ మారుతి రావు, ఆదివాసీ సర్పంచ్ ఫోరం మడావి ముకుంద్ రావు, ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కుడ్మేత జంగు, కాంగ్రెస్ పార్టీ ఆశావహ జెడ్పీటీసీ అభ్యర్థి పేందోర్ జీవన్ మహారాజ్, ఆత్రం బాలు, కుస్రం సీతారాం, 9 తెగల ఆదివాసీ సంఘాల నాయకులు, పటేల్ లు పాల్గొన్నారు.

జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ప్రయోజనం

• జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

(మంచిర్యాల ప్రతినిధి, సాక్షర) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హత గల ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని దండేపల్లి మండలం మాకులపేట గ్రామ పంచాయతీలో పథకం నిర్వహణలో భాగంగా డేటా ఎంట్రీ ప్రక్రియను మండల ప్రత్యేక అధికారి, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి చేతరాజుల దుర్గాప్రసాద్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, మండల పంచాయతీ అధికారి విజయ్ లతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు జీవిత బీమా భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. పథకానికి సంబంధించిన డేటా ఎంట్రీ ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత మార్గదర్శకాల ప్రకారం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని, అర్హత గల ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకునే విధంగా కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.ఈ పథకం ద్వారా కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమా వర్తిస్తుందని, దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన అర్జీదారులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.అనంతరం జన్నారం మండలంలోని చింతలపల్లి గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం శిబిరాన్ని మండల ప్రత్యేక అధికారి జి.శ్రీనివాస్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లతో కలిసి సందర్శించి, పథకం అమలు తీరును పరిశీలించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, ఆహార నాణ్యత, విద్యా బోధన తీరును పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ మెరుగైన సేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు, నెల్కి వెంకటాపూర్ పిఏసిఎస్ చైర్మన్ ముత్యాల శ్రీనివాస్, క్షేత్ర సహాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు

జీవిత భీమా పథకాన్ని ప్రతి అర్హ కుటుంబం సద్వినియోగం చేసుకోవాలి



(మావల, సాక్షర): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను బట్టిసావర్గాంలో ప్రారంభించామని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.మావల మండలం బట్టిసావర్గాం గ్రామ పంచాయతీ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియను శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ప్రత్యేక అధికారి మిల్కాతో కలిసి ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీఓ నందిని, బట్టిసావర్గాం సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి అశోక్, వార్డు సభ్యులు ఉషన్న, కృష్ణ, పూజ, రత్నాల లక్ష్మి, స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది



(గుడిహత్నూర్, సాక్షర): పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ లిపారు.మండలంలోని శాంతాపూర్, కోలారి గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శాంతాపూర్ గ్రామానికి చెందిన లగాడే ఈశ్వర్ కు రూ. 60,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. అలాగే కోలారి గ్రామానికి చెందిన ముండే నందకిషోర్ కు రూ. 60,000 విలువైన చెక్కును అందించారు.ఈ సందర్భంగా డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ వినియోగానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, రైతులకు రైతు భరోసా, అర్హులైన వారికి ఆసరా పింఛన్లు వంటి ప్రజోపయోగ కార్యక్రమాలతో పాటు సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని వివరించారు.ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తారని డా. నరేష్ జాదవ్ తెలిపారు.ప్రజల కష్టాల్లో తోడుగా ఉంటూ, ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. కార్యక్రమంలో గుడిహత్నూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడసం దౌలత్ రావు, శాంతాపూర్ సర్పంచ్ సబ్లే పత్తు సింగ్, ఉప సర్పంచ్ కరాడ్ రవి, మండల ఉపాధ్యక్షుడు మొయితే మారుతీ, దుబ్బాక నరేష్, సూర్యగూడ సర్పంచ్ రహీం, ఉమ్రి సర్పంచ్ భరత్, మండల మైనార్టీ అధ్యక్షుడు సమీర్ ఖాన్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ నాగ్ నాథ్ అప్ప, కోలారి మాజీ సర్పంచ్ బాలాజీ పటేల్, ఆడే జైపాల్, బోరిగాం మాజీ ఎంపీటీసీ ప్రవీణ్ రెడ్డి, బ్రహ్మానంద్, కాగ్నే రామ్ కిషన్, శ్యామ్, యోగి, మండల పిఎసి మెంబర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి పర్వతనేని రవి కత్తరసాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

(చెన్నూర్, సాక్షర) సైబర్ మోసాల పట్ల ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించకుండా సంబంధిత చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి పర్వతనేని రవి సూచించారు. శుక్రవారం మండలంలోని కత్తరసాల గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి పర్వతనేని రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సైబర్ నేరాలు, బాల్య వివాహాల నిర్మూలన, గుడుంబా తయారీ, విక్రయాల నివారణ తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించకుండా సంబంధిత చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. అలాగే గుడుంబా తయారీ, విక్రయాలకు ప్రజలు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంబావ్, ఎస్ఐ శ్యామ్ పటేల్, ఎక్సైజ్ ఎస్ఐ కె. మహేష్ తో పాటు ఎస్. రమేష్, జై పున్నం నాగులు, రాజశేఖర్, నవాజ్ ఖాన్, ఇమ్రాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

తపాలాబిళ్ల విడుదల పట్ల ఆర్యవైశ్యుల హర్షం



(జన్నారం, సాక్షర): కేంద్రప్రభుత్వం ఆర్యవైశ్య సమాజంపై తపాలాబిళ్ల విడుదల చేయడం పట్ల మండల ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మండలంలోని ఆర్యవైశ్యులు సాక్షర ప్రతినిదితో మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అంటేనే సేవకు మారుపేరు భూమి పైనుండి ఆకాశం వరకు ఎక్కడ ఏ విదమైన సహాయ కార్యక్రమం జరిగింది అంటే అక్కడ అందులో ఆర్యవైశ్యుల సహాయ సహకారాలు తప్పకుండా ఎదో ఒక రూపంలో ఉంటాయని వారు అన్నారు. మా జాతి సేవలను గుర్తించి ఇప్పటికి కేంద్ర ప్రభుత్వం ప్రదానమంత్రి నరేంద్రమోడి ఆర్యవైష్యులకు సముచిత గౌరవం అందించారని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి ప్రదానమంత్రి నరేంద్రమోడి వారి పాలకవర్గానికి దన్యవాదములు తెలుపుతున్నట్లు వారు తెలిపారు.

ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



(చెన్నూరు, సాక్షర) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో అర్హత గల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను మండల తహసిల్దార్ వనజా రెడ్డితో కలిసి పరిశీలించి ఇప్పటివరకు అందిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. దరఖాస్తు ఫారాన్ని ఎలాంటి తప్పులు లేకుండా పూరించాలని తెలిపారు. ఈ పథకం ద్వారా కుటుంబంలోని 18 నుండి 59 సంవత్సరాల వరకు వయసు ఉన్న వ్యక్తి బీమా వ్యక్తిగా ప్రతిపాదించబడతారని, భీమా పొందే వ్యక్తి స్వయంగా దరఖాస్తుపై సంతకం చేసి, నామిని వివరాలను తెలియపరిచి స్వయంగా అందించాలని తెలిపారు. కౌంటర్లు ఏర్పాటు చేసి, దరఖాస్తులు స్వీకరించి, ఆన్ లైన్ పోర్టల్ లో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఈ పథకం ద్వారా కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమా వర్తిస్తుందని, దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన అర్జీదారులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జైపూర్ గ్రామంలో ఇప్పటి వరకు 28 దరఖాస్తులు అందాయని తెలిపారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఎస్.సి. వసతి గృహ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం భీమారం మండలం మద్దికల్ గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. గ్రామంలో ఇప్పటివరకు 66 దరఖాస్తులు అందాయని, పథకానికి సంబంధించిన దరఖాస్తులను పూర్తి వివరాలతో జాగ్రత్తగా నమోదు చేయాలని, నామినీ వివరాలను లబ్ధిదారుల ఇష్టపూర్వక సమ్మతితోనే నమోదు చేయాలని సూచించారు. నామినీ ఎంపిక విషయంలో సంబంధిత లబ్ధిదారుల నుంచి భౌతికంగా సంతకాలు తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను క్రమపద్ధతిలో నిర్వహించాలి

- ఐటీడీఏ పీఓ మంద మకరందు



(ఉట్నూర్, సాక్షర) ఉట్నూర్ కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా కార్యక్రమాన్ని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, సబ్ కలెక్టర్ ప్రణయ్,డిడి అశోక్,ఎంపీడీవో రాయిస్ ఉల్లా , గ్రామ సర్పంచ్ అనిత జాదవ్ , ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మంద మకరందు మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూర్చే విధంగా రూపొందించబడిందని తెలిపారు. అయితే ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిమితుల దృష్ట్యా తొలుత రేషన్ కార్డులు కలిగిన కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వెల్లడించారు. రానున్న ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా రేషన్ కార్డులు లేని కుటుంబాలకు కూడా తగిన విధానం ద్వారా ఈ పథకం ప్రయోజనం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ క్రమబద్ధంగా జరగాలి ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ కావడంతో అన్ని వార్డుల ప్రజలు ఒకేసారి దరఖాస్తుల కోసం రావడం వల్ల రద్దీ ఏర్పడి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ఎంపీడీవో, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు సమన్వయంతో వార్డుల వారీగా దరఖాస్తుల స్వీకరణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రతి రోజు నిర్దేశించిన వార్డుల ప్రజలు మాత్రమే వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నామినీ వివరాలపై స్పష్టత ఉండాలి దరఖాస్తులో నామినీలుగా ఎవరిని ఎంపిక చేస్తున్నారో, 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారి విషయంలో అపాయింటీగా ఎవరిని నియమిస్తున్నారో, బీమా ప్రయోజనంలో ఎవరికి ఎంత శాతం వాటా కేటాయిస్తున్నారో లబ్ధిదారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. నమోదు చేసే వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు. మొబైల్ నంబర్, అప్లికేషన్ ఐడీ భద్రపరుచుకోవాలి దరఖాస్తు సమర్పించిన అనంతరం అప్లికేషన్ ఐడీ సంబంధిత లబ్ధిదారుల మొబైల్ నంబర్‌కు సందేశం రూపంలో వస్తుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ తమ మొబైల్ నంబర్‌ను సరిగ్గా నమోదు చేయాలని సూచించారు. అప్లికేషన్ ఐడీని భద్రపరుచుకోవాలని, భవిష్యత్తులో ఈ ఐడీ ద్వారా దరఖాస్తు వివరాలను పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. దరఖాస్తు వివరాల్లో తప్పులు ఉండకూడదు ఈ పథకం ఆర్థిక, బీమా, బ్యాంకింగ్ అంశాలతో ముడిపడి ఉన్నందున దరఖాస్తులో పేర్కొనే ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. లబ్ధిదారుల పేర్లు, మొబైల్ నంబర్లు, నామినీ వివరాలు, వాటాల శాతం తదితర అంశాల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం దరఖాస్తు ఒకసారి సబ్‌మిట్ చేసిన తర్వాత మార్పులు చేసుకునే అవకాశం లేనందున సబ్‌మిట్ చేయడానికి ముందే ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని స్పష్టం చేశారు. రిసెప్షన్ వద్ద ఫారాలు అందుబాటులో ఉంటాయి దరఖాస్తుదారుల సౌకర్యార్థం కార్యాలయం వెలుపల రిసెప్షన్ వద్ద ఖాళీ దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ముందుగా ఫారాలను పూర్తిగా నింపుకుని, నామినీలు, వారికి కేటాయించే వాటాల శాతం వంటి వివరాలను ఖరారు చేసుకున్న తర్వాతే కంప్యూటర్ వద్దకు రావాలని తెలిపారు. దీనివల్ల దరఖాస్తుల నమోదు ప్రక్రియ ఎలాంటి గందరగోళం లేకుండా సజావుగా పూర్తవుతుందని పేర్కొన్నారు.రేషన్ కార్డులు కలిగిన అర్హులైన కుటుంబాలందరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రయోజనం అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు కూడా అధికారులకు సహకరించి దరఖాస్తుల నమోదు ప్రక్రియను క్రమపద్ధతిలో పూర్తి చేసుకోవాలని ప్రాజెక్టు అధికారి మంద మకరందు కోరారు.

గ్రంథాలయాలు జ్ఞానానికి కేంద్రాలు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) గ్రంథాలయాలు జ్ఞానానికి కేంద్రాలు అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారంఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని నేతాజీ చౌక్ వద్ద గల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నేడు నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్యతో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆద్యంతం ఆసక్తిగా తిలకించి అభినందించారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వారు చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు మహబూబ్, మంగేష్ దేవతడే, జిల్లా కాంగ్రెస్ కార్యాలయ ఇన్చార్జి గౌలి సంజీవ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసుల చంటి, సోనాల మండల అధ్యక్షుడు పోతన్న, 14వ వార్డు ప్రెసిడెంట్ జాదవ్ రాదే శ్యామ్, బెజ్జంకి అనిల్, కౌడాల సంతోష్, సుదర్శన్, గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రిమ్స్ కు దేశ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తేవాలి

- రిమ్స్ డైరెక్టర్ బలరాంను సన్మానించిన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముడుపు ప్రభాకర్ రెడ్డి

(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) ఆదిలాబాద్ రిమ్స్ వెనుకబడిన జిల్లా, ఆదివాసుల జిల్లా కావున బాధ్యతగా తీర్చిదిద్దాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, దేశ, రాష్ట్ర స్థాయిలో ఆదిలాబాద్ రిమ్స్ కు గుర్తింపు తేవాలని మనసారా కోరుకుంటున్నామని సీపీఐ నాయకులు తెలిపారు. అదిలాబాద్ రిమ్స్ హాస్పిటల్ లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రిమ్స్ డైరెక్టర్ బలరాం సిటికేను బొకే, శాలువాతో సన్మానం చేయడం జరిగింది.సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముడుపు ప్రభాకర్ రెడ్డి వారి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని కూర్చొని మాట్లాడడం జరిగింది. అదిలాబాద్ రిమ్స్ వెనుకబడిన జిల్లా, ఆదివాసుల జిల్లా కావున బాధ్యతగా తీర్చిదిద్దాలని, మరింతగా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, దేశ, రాష్ట్ర స్థాయిలో ఆదిలాబాద్ రిమ్స్ కు గుర్తింపు తేవాలని మనసారా కోరుకుంటూ మనవి చేస్తున్నామని తెలిపారు.ఇందులో రిమ్స్ సెక్యూరిటీ గార్డ్ సూపర్వైజర్ కోలా మోహన్, సీపీఐ జిల్లా నాయకులు, జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు కొడుప సురేష్, రిమ్స్ అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉమా, జిల్లా నాయకులు శ్రీరామ్వార్ ప్రమోద్, లక్ష్మన్న, రైతు నాయకులు సుగుణాకర్ రెడ్డి, సంగీత పాల్గొన్నారు.

తుపాకీ రాముడు మాటలే రేవంత్ రెడ్డి మాట్లాడాడు

(హైదరాబాద్, సాక్షర): సిద్దిపేటలో రేవంత్ రెడ్డి వాడిన భాష , మాట్లాడిన తీరు చూసి నాకు కొంతమంది ఫోన్ చేశారు. రేవంత్ రెడ్డి నోటిదూలతో మాట్లాడిన మాటలు చూసి సిద్దిపేట డ్రైనేజ్ లు పొంగిపొర్లుతున్నాయని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్ లో అయన మీడియాతో మాట్లాడారు. సిద్దిపేటలో తుపాకీ రాముడు మాటలే రేవంత్ రెడ్డి మాట్లాడాడు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎలా తీర్చాలో మాట్లాడలేదు. రేవంత్ రెడ్డికి ప్రతిపక్ష నేతలను తిట్టడమే సరిపోతుంది. మోరీలా నోరు వేసుకొని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడు. పరిపాలన చెయ్యాల్సిన ముఖ్యమంత్రి .... హౌస్ కీపింగ్ పని చేస్తున్నాడు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రతిపక్ష నేతలను తిట్టడమే సరిపోతుంది. కేసీఆర్ కేటీఆర్ హరీష్ రావును తిట్టేందుకు రేవంత్ రెడ్డి సభలు పెడుతున్నాడు. మూడేళ్ల నుంచి ఇదేపని రేవంత్ రెడ్డి పెట్టుకున్నాడు. రేవంత్ రెడ్డి మానసిక స్థితి సరిగ్గా లేదని అనిపిస్తుంది. సిరిసిల్ల సిద్దిపేటలో గెలిచిన వారికి మంత్రి పదవులు ఇస్తానని అంటున్నాడని అన్నారు. ఇప్పుడు ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులు నింపేందుకు రేవంత్ రెడ్డికి చేత కావడం లేదు. సిద్దిపేట సభకు నాలుగు ఐదు నియోజకవర్గాల నుంచి ప్రజలను తీసుకొచ్చారు. సిద్దిపేట తెలంగాణ ఆత్మ గౌరవానికి అడ్డా , కేసీఆర్ అడ్డా. తెలంగాణ ఉద్యమానికి ఊతం ఇచ్చిన గడ్డ. సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ లేనేలేదు. సిద్దిపేట ప్రజల గుండెల్లో కేసీఆర్ , హరీష్ రావు చిరస్థాయిగా నిలిచిపోతారు. కేసీఆర్ అంటే ఒక చరిత్ర , కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదు. మడమ తిప్పకుండా చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్. తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశంలో నెంబర్ వన్ గా నిలబెట్టిన వ్యక్తి కేసీఆర్. కేసీఆర్ పై విమర్శ చెయ్యడం అంటే ఆకాశం పై ఉమ్మి వెయ్యడమేనని మండిపడ్డారు. ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచింది చంద్ర బాబు నాయుడు. చంద్ర బాబు నాయుడు పై తిరుగుబాటు చేసింది కేసీఆర్. రేవంత్ రెడ్డినే తెలుగుదేశం పార్టీకి వెన్నుపోటు పొడిచాడు. 50 లక్షల రూపాయలతో అడ్డంగా దొరికిన దొంగ రేవంత్ రెడ్డి. కేసీఆర్ పెట్టిన అనేక పథకాలు రేవంత్ రెడ్డి బండ్ పెట్టాడు. కేసీఆర్ గురించి మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి. హరీష్ రావు నికార్సైన తెలంగాణ ఉద్యమకారుడు. కేసీఆర్ ఇచ్చిన బాధ్యతలను వంద శాతం న్యాయం చేసిన వ్యక్తి హరీష్ రావు. హరీష్ రావు కుటుంబానికి పాల వ్యాపారం ఉంది. పాలు ఎవరికీ అవసరం అయితే వారికి పాలు పోస్తారు. హరీష్ రావు ఆంధ్రోళ్లకు పాలుపోస్తే.... ఆంధ్రోళ్ల అల్లుడిని ఎలా తెచ్చుకున్నావు రేవంత్ రెడ్డి....? తెలంగాణ ఉద్యమం సమయంలో చంద్ర బాబు నాయుడు లాంటి వాళ్ళకే వాత పెట్టారు. రేవంత్ రెడ్డి తెలంగాణ వాదినని చెప్పుకోవడం ఎనిమిదో వింతలా ఉంది. ఉద్యమం సమయంలో రైఫిల్ తీసుకొని పోయిన ఘటన ఎవరు మర్చిపోలేదు రేవంత్ రెడ్డి. ఉద్యమం సమయంలో తెలంగాణ ఉద్యమకారులను ఆదుకుంటే కేసీఆర్. ఉద్యమకారుల త్యాగం గొప్పదని కేసీఆర్ ఎప్పుడు చెప్తుంటాడు. ఉద్యమకారులను బిఆర్ఎస్ రాజకీయం కోసం వాడుకోలేదని అన్నారు. శ్రీకాంత్ చారి తల్లిని పక్కన పెట్టుకుని రేవంత్ రెడ్డి నీచ రాజకీయం చేశాడు. శ్రీకాంత్ చారి తల్లికి హుజూర్ నగర్ టికెట్ ఇచ్చింది బిఆర్ఎస్ పార్టీనే. శంకరమ్మ పై అభ్యర్థిని పెట్టి ఓడించారు. శ్రీకాంత్ చారి తల్లి అంటే బిఆర్ఎస్ పార్టీకి , కేసీఆర్ కు గౌరవం. అవినీతికి నిలువుటద్దమే కాంగ్రెస్, రేవంత్ రెడ్డి కుటుంబం. రేవంత్ రెడ్డి కుటుంబ అవినీతి పై మన్నె క్రిశాంక్ ఆధారాలతో సహా చెప్పాడు. భూముల పైనే 5 లక్షల కోట్లు రేవంత్ రెడ్డి సంపాదించాడని సొంత పార్టీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డే అంటున్నాడు. రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యల పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించే దమ్ము ఉందా రేవంత్ రెడ్డి...! అలా మాట్లాడుతున్న రాజగోపాల్ రెడ్డిని ఎర్రగడ్డ ఆసుపత్రికి పంపిస్తానని రేవంత్ రెడ్డి అంటున్నాడు. కుంభకోణాలకు అడ్డగా గాంధీ భవన్ మారిపోయింది,ఇప్పటి నుంచి కాంగ్రెస్ కాదు, స్కాంగ్రేస్. రేవంత్ రెడ్డి చంద్ర బాబు నాయుడు శిష్యుడని సమాజం మొత్తం తెలుసు. కన్నేపల్లి పంపులు ఆన్ చేయకుండా చంద్ర బాబు నాయుడుకు నీళ్ళు వదిలిపెట్టారు. తెలంగాణకు కాలం తెచ్చిన కరవు కాదు , కాంగ్రెస్ తెచ్చిన కరవు. రాబోయేది కేసీఆర్, రేవంత్ రెడ్డి కుంభకోణాలు బయటపెట్టి రేవంత్ రెడ్డి అంతు చూసేది కేసీఆర్ నేనని అన్నారు.

ఆత్మపరిశీలనతో వ్యసనాలను జయించవచ్చు: బ్రహ్మకుమారీస్



(అదిలాబాద్, సాక్షర): వ్యసన విముక్త సమాజ నిర్మాణమే లక్ష్యంగా బ్రహ్మకుమారీస్ ఓం శాంతి ఆధ్యాత్మిక విభాగం రూపొందించిన ప్రచార వాహనాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యం, నైతిక విలువలను పెంపొందించేలా చేపడుతున్న కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని ఆయన ప్రశంసించారు. ప్రారంభోత్సవంలో మీత బెన్(ముంబై), ఎల్లుల సంతోష్ కుమార్ ప్రాంతీయ నిర్వహణ కార్యదర్శి తెలంగాణ వినియోగదారుల సంఘాల సమైఖ్య (క్యాట్ కో), ఫిరోజ్ ఖాన్, సామాజిక కార్యకర్త సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, పుష్ప , అర్చన, గీత, సంగీత దీదీ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రేవతి దీదీ మాట్లాడుతూ రాజయోగ ధ్యానం, ఆత్మపరిశీలన మనిషిలో ఆత్మవిశ్వాసం, సంకల్పబలాన్ని పెంపొందించి వ్యసనాల నుంచి బయటపడేందుకు దోహదపడతాయని వివరించారు. సానుకూల ఆలోచనలు, దృఢమైన నిర్ణయాలతో చెడు అలవాట్లను అధిగమించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చన్నారు. యువత వ్యసనాలకు బానిస కాకుండా తమ శక్తిసామర్థ్యాలను గుర్తించి, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వ్యసన విముక్తి సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జర్నలిస్టులు, మీడియా సంస్థలు సహకరించాలని కోరారు. జిల్లావ్యాప్తంగా పర్యటించే ప్రచార వాహనం ద్వారా వ్యసనాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనానికి అలవాట్ల మార్పు ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు.

గ్రామ అభివృద్ధికి అందరం కలిసి కృషి చేద్దాం



(ఆదిలాబాద్‌రూరల్, సాక్షర): ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆదిలాబాద్ శాసనసభ్యుడు పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి కలిసి ఘనంగా ప్రారంభించారు.ముందుగా గ్రామానికి విచ్చేసిన ముఖ్య అతిథులకు గ్రామస్తులు డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ఆదివాసీ వీరుడు కొమురం భీమ్ విగ్రహాలకు నేతలు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న వివో భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించడంతో పాటు, నూతన గ్రంథాలయం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాలను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రమేష్, ఎంపీడీవో వంశీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నజిమా, స్థానిక సర్పంచ్ నిరోషా, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత



(ఆదిలాబాద్‌రూరల్, సాక్షర): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న అభివృద్ధి పనులు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేలా ఉండాలని పేర్కొన్నారు.శుక్రవారం ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయం, గ్రామ సమాఖ్య (వీఓ) భవనం, ఏసీ సామాజిక భవనాలను స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం భవనాలను పరిశీలించి వాటి వినియోగం గురించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులు నూతనంగా నిర్మించిన గ్రామ సమాఖ్య భవనాన్ని సద్వినియోగం చేసుకొని సంఘాల కార్యకలాపాలను మరింత విస్తరించుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించే దిశగా సమష్టిగా కృషి చేయాలన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. సామాజిక భవనం గ్రామ ప్రజలకు శుభకార్యాలు, ఇతర సామూహిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, యాపల్‌గూడ గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్షలైన గ్రంథాలయం, గ్రామ సమాఖ్య భవనం, ఏసీ సామాజిక భవనం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రమేశ్, ఎంపీడీఓ వంశీకృష్ణ, స్థానిక సర్పంచి నిరోష, పంచాయతీ కార్యదర్శి నజీమా, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో ఘనంగా చేయూత పెన్షన్ల పంపిణీ

- లబ్ధిదారులకు పెన్షన్ మంజూరీ పత్రాలు అందజేసిన జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క

(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని బాల్కొండ నియోజకవర్గం పరిధిలో చేయూత పథకం కింద 3,092 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయని, వీరికి మొత్తాలు ఈ నెల 26న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రంలోని మణికంఠ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరు కాగా శాసన మండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు పలువురు ప్రజా ప్రతినిధుల సమక్షంలో కొత్తగా మంజూరైన చేయూత పెన్షన్ల లబ్ధిదారులకు పెన్షన్ మంజూరీ పత్రాలను అందజేశారు. అదేవిధంగా బాల్కొండ నియోజకవర్గంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.21.91 కోట్ల విలువైన రుణాలను చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. శాసన మండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్డీఓ సాయన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి రాష్ట్రంలో 4.63 లక్షల మందికి చేయూత పెన్షన్లు అందుతుండగా, వారిలో 3.50 లక్షల మంది మహిళలే ఉన్నారని తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే లక్ష్యంతో మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ, వ్యాపార కార్యకలాపాలను నిర్వహించుకునేందుకు ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, పాఠశాల విద్యార్థుల యూనిఫారాల కుట్టింపు వంటి బాధ్యతలను కూడా మహిళా సంఘాలకు అప్పగించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలు కమీషన్ రూపంలో రూ.167 కోట్ల ఆదాయం ఆర్జించాయని వివరించారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్ల నిర్వహణలోనూ మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, మహిళా సంఘాల ఆదాయ వనరులు పెంపొందేలా ఆర్టీసీ అద్దె బస్సులను సమకూర్చుతున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిట మంజూరు చేస్తూ, స్వయం సహాయక సంఘాల ద్వారా ఇంటి నిర్మాణానికి అవసరమైన పెట్టుబడి కోసం రుణాలు అందిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.76 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని, 300కు పైగా మహిళా సంఘ భవనాలను నిర్మించామని తెలిపారు. 60 సంవత్సరాలు దాటిన మహిళలకు కూడా ఆర్థిక చేయూత అందిస్తున్నామని, స్వయం సహాయక సంఘం నుంచి రుణం తీసుకున్న సభ్యురాలు దురదృష్టవశాత్తు మరణిస్తే ఆమె తీసుకున్న రుణాన్ని మాఫీ చేయడంతో పాటు రూ.10 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నామని మంత్రి సీతక్క వివరించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని, ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, కొత్తగా చేయూత పెన్షన్లు మంజూరు కావడం ఎంతో సంతోషకరమన్నారు. చేయూత పెన్షన్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని,జిల్లా వ్యాప్తంగా మొత్తం 20,555 మందికి కొత్తగా చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని కలెక్టర్ వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క లబ్ధిదారులకు పెన్షన్ మంజూరీ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అన్ని సాధించవచ్చు

- ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మకరంద్

(జన్నారం, సాక్షర) గిరిజన గ్రామాలలోని విద్యార్థులు మంచిగా, క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని, విద్యతో తమకు తాము ఉన్నత స్థాయికి ఎదుగుతూ తమ కుటుంబాలు, గ్రామాలు సైతం అభివృద్ధి చెందుతాయని ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మకరంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని మారుమూల గిరిజన గ్రామం కొత్తపేట గ్రామ పంచాయితీలోని కోలాంగూడలో మండల అధికారులతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామంలో త్రాగునీరు, రహదారులు, విద్య, ఉపాధి తదితర విషయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలలోని విద్యార్థులు మంచిగా క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని, విద్యతో తమకు తాము ఉన్నత స్థాయికి ఎదుగుతూ తమ కుటుంబాలు, గ్రామాలు సైతం అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు.గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తున్నదని, దానిని ప్రతి ఒక్క గిరిజనుడు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ ఒక్కరు కూడా ప్రభుత్వ వ్యతిరేక విధానాల వైపు చూడవద్దని, క్రమశిక్షణతో ఉంటే మంచి భవిష్యత్ ఉంటుందని ఆయన తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని పెద్దలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తూ గ్రామంలో కాని, ప్రజలకు కాని ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలని, ఏ సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ బక్కయ్య, మండల ఉపాధి హామీ అధికారి రవీందర్, మండల రెవెన్యూ అధికారి వెంకటేశం, గ్రామ సర్పంచ్ దినేష్, గ్రామ పటేల్ కొడప ముత్తుకోవా, పంచాయితీ కార్యదర్శి బీంరావు, గ్రామస్తులు సోనేరావు, ఆనందరావు, గోపి, జైవాంత్ రావు, తిరుపతి, అంగన్వాడి, హౌసింగ్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నషా ముక్త్ భారత్ అభియాన్' ప్రచార రథాన్ని ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా,



వ్యసన రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి (ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) మత్తు పదార్థాలు, దురలవాట్లు యువత భవిష్యత్తును, కుటుంబ వ్యవస్థను నాశనం చేస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆదిలాబాద్ బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్ - మిషన్ స్పందన' అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రచార రథాన్ని ప్రారంభించారు.వ్యసన రహిత సమాజ నిర్మాణం, "నషా ముక్త్ తెలంగాణ" లక్ష్యంగా ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పించేందుకు ఈ ప్రచార రథాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ మత్తు పదార్థాలు, దురలవాట్లు యువత భవిష్యత్తును, కుటుంబ వ్యవస్థను నాశనం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యసన రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి బ్రహ్మకుమారీస్ సంస్థ, ప్రభుత్వ విభాగాలు సంయుక్తంగా చేపడుతున్న ఈ ప్రచార కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జ్యోతి, బీకే రేవతి, పుష్ప, గీత, అర్చన తదితరులు పాల్గొన్నారు.

ఆస్నాద్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

- 150 మందికి కంటి పరీక్షలు 35 మందికి ఉచిత శస్త్రచికిత్సలు



(చెన్నూర్, సాక్షర) గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు.లయన్స్ క్లబ్ గరిమెళ్ళ మంచిర్యాల వారి ఆధ్వర్యంలో శుక్రవారం చెన్నూరు మండలంలోని ఆస్నాద్ గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు నరేళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ శిబిరానికి గ్రామస్థుల నుండి విశేష స్పందన లభించింది.ఈ శిబిరంలో వైద్య బృందం సుమారు 150 మందికి పైగా గ్రామస్థులకు అత్యాధునిక పరికరాలతో కంటి వైద్య పరీక్షలు నిర్వహించింది. పరీక్షల అనంతరం కంటిలో శుక్లాలు ఏర్పడిన 35 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం గుర్తించి, వారిని క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో ఉచితంగా రేకుర్తి ఆసుపత్రికి తరలించారు. వీరికి శనివారం, నవంబర్ 21న కంటి ఆపరేషన్లు నిర్వహించి, శుక్లాలు తొలగించి కంటి అద్దాలు అమర్చనున్నారు. అనంతరం ఆదివారం, 22.11.2026న తిరిగి ఉచిత బస్సు సౌకర్యంతో వారందరినీ క్షేమంగా గ్రామానికి తీసుకురానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కాసం మల్లికార్జున, ప్రోగ్రాం చైర్‌పర్సన్ కే. శెట్టి శ్రీనివాస్, లయన్ సభ్యులు సజ్జనపు రామచందర్, రమేష్ బాబు, శ్యాంసుందర్, పి.ఏ.వి.ఎన్. చారి, ఆస్నాద్ గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొని సేవలందించారు.

ఇందిరమ్మ రాజ్యం.. ఎవరికి సాధ్యం??



ఒక ప్రాంతానికి వేల కోట్ల రూపాయల అభివృద్ధి ప్రకటనలు.. మరో ప్రాంతానికి నిధుల కోసం విజ్ఞప్తులు! ఈ వ్యత్యాసం రాజకీయ చర్చకే పరిమితమా.. పాలనా ప్రాధాన్యతలపై ప్రజల్లో మొదలవుతున్న ప్రశ్నకు సంకేతమా? కొడంగల్‌లో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన నియోజకవర్గానికి రూ.500 కోట్ల నిధులు కోరడం ప్రాంతీయ సమతుల్యతపై చర్చకు తెరలేపాయి. అభివృద్ధి ఎక్కడ జరిగినా స్వాగతించాల్సిందే.. కానీ అన్ని ప్రాంతాల అవసరాలకు తగిన ప్రాధాన్యత లభిస్తోందా అన్నదే కీలకం. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ హయాంలో తాంసి మండల మాజీ ఎంపీపీ మంజుల శ్రీధర్ రెడ్డి నాయకత్వంలో, సురకుంటి శ్రీధర్ రెడ్డి సహకారంతో చేపట్టినట్లు పేర్కొంటున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కూడా ప్రస్తావనకు వస్తున్నాయి. గతంలో స్థానిక ప్రజల కోసం పనిచేసిన నాయకుల అనుభవాన్ని, సేవలను ప్రస్తుత ప్రభుత్వం ఎంతవరకు గుర్తిస్తోంది? అభివృద్ధికి రాజకీయ రంగుల కంటే ప్రజాప్రయోజనాలే ప్రాధాన్యత పొందుతున్నాయా? అన్న ప్రశ్నలు 'ఇందిరమ్మ రాజ్యం' పాలనా తీరుపై ఆసక్తిని పెంచుతున్నాయి.

అభివృద్ధి అంకెలు.. సమానత్వ సూత్రం!

కొడంగల్‌లో రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరగడం రాష్ట్ర మౌలిక వసతుల కల్పనలో కీలక పరిణామం. రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర సదుపాయాల కల్పనతో ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే అవకాశాలున్నాయి. అయితే అభివృద్ధి ప్రకటనలతో పాటు వెనుకబడిన ప్రాంతాల అవసరాలు, తాగునీరు, వ్యవసాయం, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అంశాలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. మునుగోడు ఎమ్మెల్యే నిధుల అవసరంపై చేసిన విజ్ఞప్తిని కూడా ఈ కోణంలో పరిశీలించాలి. ఏ ప్రాంతానికి ఎంత కేటాయించారు, ఎంత విడుదల చేశారు, పనులు ఏ దశలో ఉన్నాయి అనే వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచితే పారదర్శకత పెరుగుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వ సూత్రాన్ని ప్రతిపాదించినప్పటికీ ప్రతి నియోజకవర్గానికి ఒకే మొత్తంలో నిధులు ఇవ్వాలని నిర్దేశించదు. ప్రాంతాల అవసరాలు, వెనుకబాటుతనం, జనాభా, మౌలిక వసతుల కొరత ఆధారంగా న్యాయమైన ప్రాధాన్యత కల్పించడమే సమర్థ పాలనకు నిదర్శనం.

పార్టీలు మారినా.. ప్రజాసేవకు గుర్తింపు ఉంటుందా?

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సురకుంటి శ్రీధర్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి, ప్రజాసేవా కార్యక్రమాలు తాంసి మండల రాజకీయాల్లో ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన అంశాలుగా స్థానికంగా ప్రస్తావించబడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి అవసరాలు, రహదారులు, ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలపై ఆయన చొరవ చూపినట్లు అందించిన వివరాలు పేర్కొంటున్నాయి. పదవులకు అతీతంగా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, అభివృద్ధి పనుల కోసం సంబంధిత వ్యవస్థలతో సంప్రదింపులు జరపడం స్థానిక నాయకత్వానికి ప్రజలతో అనుబంధాన్ని పెంచే అంశాలు. రాజకీయంగా పార్టీ మారినప్పటికీ గతంలో చేసిన ప్రజా సేవను విస్మరించకుండా, ఆయన అనుభవాన్ని ప్రస్తుత అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించుకోవడం నిర్మాణాత్మక విధానం అవుతుంది. గత పాలనలో చేపట్టిన పనులను రాజకీయ కోణంలో కాకుండా ప్రజలకు అందిన ప్రయోజనాల ఆధారంగా సమీక్షిస్తే, ఉపయోగకరమైన సేవా నమూనాలను కొనసాగించేందుకు అవకాశం ఉంటుంది. అభివృద్ధికి కృషి చేసిన నాయకుల అనుభవాన్ని గుర్తించడం, కొత్త అవకాశాలకు మార్గం కల్పించడం ప్రజాస్వామ్య రాజకీయాల్లో ఆరోగ్యకరమైన పరిణామం.

ప్రగతి అందరికీ చేరితేనే.. ఇందిరమ్మ రాజ్యం!

ప్రజలకు అందిన అభివృద్ధి ఫలాలే ఏ ప్రభుత్వానికైనా అసలైన గుర్తింపు. గ్రామాల్లో తాగునీరు, మెరుగైన రహదారులు, విద్యా-వైద్య సదుపాయాలు, అర్హులకు సంక్షేమ పథకాలు అందినప్పుడే పాలనపై విశ్వాసం పెరుగుతుంది. భారీ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చినట్లే చిన్న గ్రామాల అవసరాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా, నిధుల కేటాయింపు నుంచి పనుల పూర్తివరకు పారదర్శకత పాటించాలి. తాంసి మండలంలో మంజుల శ్రీధర్ రెడ్డి నిర్వహించిన మాజీ ఎంపీపీ బాధ్యతలు, సురకుంటి శ్రీధర్ రెడ్డి అందించిన సహకారం, బీఆర్ఎస్ హయాంలో చేపట్టినట్లు పేర్కొంటున్న అభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత ఆధారాలతో సమీక్షించి, ప్రజలకు ఉపయోగపడే అంశాలను గుర్తించడం అవసరం. రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవ చేసిన వారికి తగిన గుర్తింపు, ప్రాంతీయ అవసరాలకు న్యాయమైన ప్రాధాన్యత, ప్రభుత్వ నిర్ణయాల్లో జవాబుదారీతనం కలిసినప్పుడే అభివృద్ధి అందరికీ చేరుతుంది. ఇందిరమ్మ రాజ్యం అంటే కొందరికే కనిపించే ప్రగతి కాదు.. ప్రతి ప్రాంతం, ప్రతి గ్రామం అభివృద్ధిలో భాగస్వామ్యమయ్యే పాలన. ఆ లక్ష్యం నెరవేరినప్పుడే ప్రజల ఆకాంక్షలకు నిజమైన సమాధానం లభిస్తుంది.



వ్యాసకర్త: ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, ఫోన్: 9640466464

23న బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ రాక : అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): ఎస్ ఐఆర్ పై కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పి కొట్టడానికే బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ ఈ నెల 23న ఇందూరుకు వస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిజెపి కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, ఆయా మోర్చాల అధ్యక్షులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నితిన్ నబీన్ జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణకు ఇది రెండోసారి రావడం అన్నారు. ఇందూరుకు మొదటిసారిగా వస్తున్నారని చెప్పారు. అయితే అధికారికంగా ఒకటి రెండు రోజుల్లో చెప్పడం జరుగుతుందన్నారు. కావున ప్రతి నాయకుడు జన సమీకరణ ఎక్కువగా చేపట్టాలని సూచించారు. ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని ఇందూరు కాషాయానికి అడ్డా అని తెలిపారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. బిజెపి బలం చూపించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై ఇప్పటికే ప్రజలకు స్పష్టత వచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ పడిపోతుందని, వారి ఎమ్మెల్యేలే సీఎం రేవంత్ రెడ్డి పై చేస్తున్న ఆరోపణలు ఎందుకు ఉదాహరణ అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ జ్యోతి, కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): తన పరిధిలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని, మిగతా వాటిని ప్రభుత్వానికి రిఫర్ చేస్తానని ఐటీడీఏ పీఓ తెలియజేశారు.గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నెలకొని ఉన్న విద్యార్థి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికై తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓని కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది.ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో చలి తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు వేడి నీటి వసతిని కల్పించాలని, అదేవిధంగా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల కొరకు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా కంప్యూటర్ బోధకులను నియమించాలని, ఆశ్రమ పాఠశాలలో మౌలిక వసతులలో భాగంగా శిథిలావస్థలో ఉన్న భవనాలను మరమ్మతులు చేయించాలని, అదేవిధంగా తరగతి గదులకు కలర్స్ వేయించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులపై వివిధ కార్యక్రమాల పేరుతో నిర్వహిస్తున్న ఆన్లైన్ పని భారాన్ని తగ్గించడానికై కంప్యూటర్ సహాయకులను నియమించాలని, ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులను వార్డెన్ విధుల నుంచి తప్పించి హెచ్.డబ్ల్యూ.ఓ పోస్టులను ప్రభుత్వం ద్వారా నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలని, ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీలకు కనీస మూల వేతనం ప్రభుత్వానికి వచ్చేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని, ఐటీడీఏలో ఉపాధ్యాయ ఖాళీలన్నింటిని భర్తీ చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.సమస్యలను కూలంకషంగా విన్న పీఓ తన పరిధిలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని, మిగతా వాటిని ప్రభుత్వానికి రిఫర్ చేస్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజింగ్ రావు, జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. వృకోదర్, కార్యదర్శి పి. బాపురావు, జిల్లా ఉపాధ్యక్షుడు సాయికాంత్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికునికి ఆర్థిక సహాయం



(జన్నారం, సాక్షర): కుటుంబ సభ్యురాలిని కోల్పోయిన బాధను ఎవరూ తీర్చలేరని, ఇలాంటి కష్టకాలంలో కుటుంబానికి కొంత ఆర్థిక తోడ్పాటు అందించడం ద్వారా మనోధైర్యాన్ని కల్పించవచ్చని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపకుడు కల్లెడ బూమయ్య అన్నారు.మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు సుంకరి రాజన్నకు తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాంపూర్ కమిటీ ఆధ్వర్యంలో 14 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించినట్లు సమితి వ్యవస్థాపకుడు కల్లెడ బూమయ్య తెలిపారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాంపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు సుంకరి రాజన్న భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిందని, ఆ కుటుంబానికి ఆర్థిక చేయూత అందించాలనే ఉద్దేశంతో సమితి ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో ఈ డబ్బులు అందజేయడం జరిగిందని ఆయన అన్నారు. కుటుంబ సభ్యురాలిని కోల్పోయిన బాధను ఎవరూ తీర్చలేరని, ఇలాంటి కష్టకాలంలో కుటుంబానికి కొంత ఆర్థిక తోడ్పాటు అందించడం ద్వారా మనోధైర్యాన్ని కల్పించవచ్చని, ఈ కుటుంబానికి అందించిన ఈ ఆర్థిక సహాయం కేవలం డబ్బు మాత్రమే కాకుండా బాధలో ఉన్న కుటుంబానికి సంఘం అండగా ఉందనే భరోసా, ఆత్మీయతకు నిదర్శనమని ఆయన అన్నారు. శుక్రవారం రాజన్న ఇంటికి వెళ్లి డబ్బులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు లింగాల వెంకటేష్, రాష్ట్ర కన్వీనర్ సంద సుదర్శన్, కమిటీ సభ్యులు కల్లెడ లచ్చయ్య, బరగంటి వెంకటేష్, రేసవేణి లచ్చన్న, వేముల సత్తయ్య, గ్రామ పెద్దలు సంధినేని శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటి వనరుల పరిరక్షణ, ప్రాజెక్టు భద్రతపై రిటైర్డ్ ఇంజనీర్ల బృందం పరిశీలన



నాగార్జున సాగర్, సాక్షర: విజయపురి సౌత్ పరిధిలోని నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం కన్వీనర్ శ్యాం ప్రసాద్‌రెడ్డి బృందం శుక్రవారం పరిశీలించింది. జలాశయ నిబంధనలకు విరుద్ధంగా ఇంటెక్ వెల్ సంపు నిర్మాణ పనులు జరుగుతున్నాయంటూ ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో రైట్ బ్యాంక్ లో బ్యాక్‌వాటర్ ప్రాంతంలో కొనసాగుతున్న నిర్మాణ పనుల తీరును వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు ఎలా వచ్చాయనే అంశంపై ఆరా తీశారు. ఇంటెక్ వెల్ సంపు నిర్మాణంతో నాగార్జునసాగర్ జలాశయ భద్రతకు ఏమైనా ముప్పు ఉందా అనే కోణంలోనూ పరిశీలన చేశారు. నీటి వనరుల పరిరక్షణ, ప్రాజెక్టు భద్రతకు సంబంధించిన పలు అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్మాణ పనులకు సంబంధించి అధికారులు అనుసరిస్తున్న విధానంపై శ్యాం ప్రసాద్‌రెడ్డి ఆరా తీశారు. జలాశయ పరిధిలో నిర్మాణాలకు సంబంధించి ఉన్న నిబంధనలు, అనుమతులపై అధికారులను ప్రశ్నించారు. ప్రాజెక్టు భద్రతకు విఘాతం కలిగించేలా ఎలాంటి నిర్మాణాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి వనరుల పరిరక్షణతో పాటు జలాశయ భద్రతను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇంటెక్ వెల్ సంపు నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలు, అనుమతులు, నిబంధనలపై మరింత స్పష్టత రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అంతకుముందు రిటైర్ ఇంజనీర్ల బృందంతో శ్యాం ప్రసాద్ రెడ్డి తిరుమలగిరి సాగర్ మండలంలోని నెల్లికల్ లిఫ్టు ప్రాజెక్టును సందర్శించారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి

- ప్రజా జాగృతి సమితి రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ రాజలింగు మోతె



(రామకృష్ణాపూర్, సాక్షర) బాలలపై ప్రేమ చూపడమే కాదు, వారి హక్కులను గౌరవించి, వారికి భద్రమైన భవిష్యత్తును అందించాలని, బాలల రక్షణే సమాజ రక్షణ, బాలల అభివృద్ధే దేశ అభివృద్ధి అని అడ్వకేట్ రాజలింగు మోతె పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు, శారీరక, మానసిక హింస, సైబర్ నేరాలు వంటి సమస్యలు బాలల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి బాలుడికి, బాలికకు విద్య, ఆరోగ్యం, రక్షణ, సమాన అవకాశాలు కల్పించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టంపై పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, బాలలపై జరిగే నేరాల విషయంలో తక్షణ స్పందన, సోషల్ మీడియా వేధింపుల నివారణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, చట్టపరమైన రక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, బాలల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ కు ప్రజా జాగృతి సమితి తరఫున వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.బాలలపై ప్రేమ చూపడమే కాదు, వారి హక్కులను గౌరవించి, వారికి భద్రమైన భవిష్యత్తును అందించాలి. బాలల రక్షణే సమాజ రక్షణ, బాలల అభివృద్ధే దేశ అభివృద్ధి అని అడ్వకేట్ రాజలింగు మోతె పేర్కొన్నారు.

ప్రపంచం మారబోతోందా? మనిషి భవిష్యత్తు ఏమిటి?



2026–2030.. ఐదేళ్లలో ప్రపంచ ముఖచిత్రం మారుతుందా?

యుద్ధాలు, కృత్రిమ మేధస్సు, ప్రకృతి విపత్తులు.. మానవత్వానికి అసలైన పరీక్ష!

ప్రపంచ చరిత్రలో కొన్ని సంవత్సరాలు కేవలం కాలగమనంలో భాగంగా మిగిలిపోవు. అవి చరిత్రను మలుపు తిప్పే కీలక ఘట్టాలుగా నిలిచిపోతాయి. ప్రస్తుతం ప్రపంచం అలాంటి ఒక చారిత్రక మలుపు వద్ద నిలబడి ఉంది. 2026 నుంచి 2030 వరకు రాబోయే ఐదేళ్లు మానవజాతి భవిష్యత్తును నిర్ణయించే అత్యంత కీలకమైన కాలంగా మారే అవకాశముంది. మనిషి జీవన విధానం, ఆలోచనా ధోరణి, ఉద్యోగాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, రాజకీయాలు, అంతర్జాతీయ సంబంధాలు.. ఇలా ప్రతి రంగంలోనూ పెను మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ఇవి కేవలం సాంకేతిక మార్పులు కావు. మనిషి ఎలా బతకాలి? భవిష్యత్తు తరాలకు ఎలాంటి ప్రపంచాన్ని అందించాలి? అనే ప్రశ్నలను మన ముందుంచుతున్నాయి.

యుద్ధాల మధ్య శాంతి కోసం ప్రపంచం అన్వేషణ!

ప్రపంచంలో ఒకవైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మరోవైపు ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలు, పశ్చిమాసియా పరిణామాలు అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. దేశాలు తమ రక్షణ కోసం భారీగా నిధులు వెచ్చిస్తున్నాయి. ఆధునిక క్షిపణులు, డ్రోన్లు, అణ్వాయుధాలు, సైబర్ యుద్ధ సామర్థ్యాల కోసం పోటీ పడుతున్నాయి.కానీ ఒక ప్రశ్నకు మాత్రం ప్రపంచం సమాధానం చెప్పలేకపోతోంది. ఇన్ని ఆయుధాలు సమకూర్చుకుంటున్న మానవజాతి తన భవిష్యత్తుకు భద్రతను కల్పించుకోగలుగుతోందా? యుద్ధంలో గెలిచిన దేశానికి భూభాగం దక్కవచ్చు. కానీ ఓడిపోయేది మాత్రం మానవత్వమే. ప్రాణాలు కోల్పోయేది సైనికులు మాత్రమే కాదు.. అమాయక ప్రజలు, పిల్లలు, మహిళలు, వృద్ధులు కూడా. రాబోయే రోజుల్లో ప్రపంచ దేశాల ముందు రెండు మార్గాలు ఉండబోతున్నాయి. ఒకటి ఆధిపత్యం కోసం పోరాటం.. మరొకటి సహకారం ద్వారా అభివృద్ధి. ఆయుధాల బలం కంటే ఆర్థిక బలం, వాణిజ్య సంబంధాలు, సాంకేతిక సహకారం, దౌత్యానికి ప్రాధాన్యత పెరగాల్సిన అవసరం ఉంది.భారతదేశం మొదటి నుంచీ ప్రపంచ శాంతి, చర్చలు, దౌత్య పరిష్కారాలకు ప్రాధాన్యత ఇస్తూ వస్తోంది. 'వసుధైవ కుటుంబకం' అనే భారతీయ భావన ప్రపంచానికి మరింత అవసరమవుతోంది.

ఏఐ విప్లవం.. మనిషి చేసే పనిని యంత్రం చేస్తుందా?

ఇప్పటివరకు మనిషి యంత్రాలను తయారు చేశాడు. ఇప్పుడు మనిషి ఆలోచనా ప్రక్రియలో కూడా యంత్రాలు భాగస్వాములవుతున్నాయి. అదే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ).2026 నాటికి కృత్రిమ మేధస్సు సామాన్య ప్రజల జీవితాల్లోకి విస్తృతంగా ప్రవేశించింది. రాబోయే ఐదేళ్లలో దీని ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉంది. వైద్యరంగంలో వ్యాధులను గుర్తించడం, పరీక్షల నివేదికలను విశ్లేషించడం, చికిత్సకు సహాయక సూచనలు ఇవ్వడం.. విద్యారంగంలో విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధించడం.. వ్యవసాయంలో పంటల పరిస్థితిని అంచనా వేయడం.. మీడియా రంగంలో వార్తల సేకరణ, అనువాదం, సమాచార విశ్లేషణ.. ఇలా ప్రతి రంగంలో ఏఐ పాత్ర పెరగనుంది.రేపటి రోజుల్లో ఏఐ డాక్టర్‌కు సహాయకుడిగా, ఏఐ టీచర్ విద్యార్థికి మార్గదర్శిగా, ఏఐ జర్నలిజం వార్తా సేకరణలో సహాయక సాధనంగా మారవచ్చు. అయితే ఇక్కడ ఒక ప్రమాదం కూడా ఉంది. సాంకేతికతను ఉపయోగించేవారు ముందుకు వెళ్తారు. దాన్ని అర్థం చేసుకోలేనివారు వెనుకబడే అవకాశం ఉంది. కొన్ని ఉద్యోగాలు మారవచ్చు, మరికొన్ని కనుమరుగవవచ్చు. అదే సమయంలో కొత్త వృత్తులు, కొత్త అవకాశాలు కూడా పుట్టుకొస్తాయి.కానీ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఏఐ సమాచారం ఇవ్వగలదు.. విశ్లేషించగలదు.. వేగంగా నిర్ణయాలకు తోడ్పడగలదు. కానీ మనిషి అనుభవం, సామాజిక బాధ్యత, నైతిక విలువలు, కరుణ, ఆత్మీయతలకు ప్రత్యామ్నాయం కావడం అంత సులభం కాదు.భవిష్యత్తులో ఏఐని చూసి భయపడేవారు కాదు.. ఏఐని బాధ్యతాయుతంగా ఉపయోగించుకునేవారే విజేతలు.

జర్నలిజం కూడా పెను మార్పుల దశలోకి!

ఈ మార్పుల్లో మీడియా రంగం కూడా మినహాయింపు కాదు. ఒకప్పుడు వార్తల కోసం విలేకరి గ్రామాలు తిరిగేవాడు. ప్రజల సమస్యలను తెలుసుకునేవాడు. అధికారులను ప్రశ్నించేవాడు. ఆధారాలను సేకరించి వార్తలు రాసేవాడు. ఇప్పుడు ఒక్క మొబైల్ ఫోన్‌తోనే ప్రపంచంలోని సమాచారాన్ని క్షణాల్లో తెలుసుకునే పరిస్థితి వచ్చింది. రేపటి రోజుల్లో ఏఐ వార్తలను రూపొందించవచ్చు. వీడియోలు సృష్టించవచ్చు. అనేక భాషల్లోకి అనువదించవచ్చు.కానీ నిజమైన జర్నలిజం అంటే కేవలం వార్తలు రాయడం కాదు. వార్త వెనుక ఉన్న వాస్తవాన్ని వెలికితీయడం. బాధితుడి కన్నీటిని అర్థం చేసుకోవడం. అధికారాన్ని ప్రశ్నించడం. సమాజానికి నిజాన్ని అందించడం. ఏఐ సృష్టించిన వార్తను ప్రచురించడం సులభం. కానీ ఆ వార్తలోని నిజానిజాలను పరిశీలించి ప్రజల ముందు ఉంచడం జర్నలిస్టు బాధ్యత.అందుకే భవిష్యత్తులో జర్నలిస్టులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నిజాయితీ, నిబద్ధత, సామాజిక స్పృహ మరింత అవసరం.

ప్రకృతి హెచ్చరికలు.. భవిష్యత్తులో నీరే అసలైన సంపద!

మరోవైపు ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు వాతావరణ మార్పు. ఒక ప్రాంతంలో విపరీతమైన వర్షాలు, మరో ప్రాంతంలో కరువు.. ఎక్కడో భీకర వరదలు, మరెక్కడో మండుతున్న ఎండలు. తుపాన్లు, అడవుల దహనం, భూగర్భ జలాల తగ్గుదల మానవజాతికి హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. ప్రకృతిని మనిషి తన అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. కానీ ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే దాని ప్రభావం తిరిగి మనిషిపైనే పడుతుంది.రాబోయే రోజుల్లో ప్రపంచ దేశాలకు నీటి భద్రత, ఆహార భద్రత, స్వచ్ఛమైన గాలి, పర్యావరణ పరిరక్షణ ప్రధాన సవాళ్లుగా మారవచ్చు. నీటి వనరుల కోసం దేశాలు, ప్రాంతాల మధ్య ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం కూడా ఉంది.మన తెలంగాణలోనూ రైతాంగం వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొంటోంది. వర్షాలపై ఆధారపడిన వ్యవసాయం నుంచి నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటలు, ఆధునిక సాగు పద్ధతుల వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. రైతు బతికితేనే సమాజం బతుకుతుంది. నీరు ఉంటేనే వ్యవసాయం ఉంటుంది. వ్యవసాయం ఉంటేనే ఆహార భద్రత ఉంటుంది.అందుకే భవిష్యత్తులో సంపద అంటే కేవలం డబ్బు, బంగారం, భూములు మాత్రమే కాదు. నీరు, నేల, విత్తనం, స్వచ్ఛమైన గాలి కూడా అసలైన సంపదలుగా మారబోతున్నాయి.

భారత్.. ప్రపంచానికి కొత్త దిశ చూపగలదా?

ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థలు మారుతున్న తరుణంలో భారత్ పాత్ర అత్యంత కీలకంగా మారుతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశాల్లో భారత్ ఒకటి. సాంకేతిక పరిజ్ఞానం, అంతరిక్ష పరిశోధనలు, డిజిటల్ చెల్లింపులు, ఔషధ ఉత్పత్తులు, వ్యవసాయం, సేవారంగాల్లో భారత్ తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటోంది.అమెరికా సాంకేతిక, ఆర్థిక శక్తిగా.. చైనా పారిశ్రామిక శక్తిగా ఎదిగినట్లే, భారత్ కూడా తన ప్రత్యేకతతో ప్రపంచంలో కీలక పాత్ర పోషించే అవకాశాలు కలిగి ఉంది.కానీ భారత్ అసలైన బలం కేవలం జనాభా కాదు. వైవిధ్యంలో ఏకత్వం, ప్రజాస్వామ్య వ్యవస్థ, కుటుంబ విలువలు, ఆధ్యాత్మిక వారసత్వం, సహజీవన సంస్కృతి కూడా మన బలాలు.భారత్ ప్రపంచానికి చెప్పాల్సిన సందేశం ఒక్కటే. అభివృద్ధి కావాలి.. కానీ విధ్వంసం వద్దు. సాంకేతికత కావాలి.. కానీ మానవత్వం మరువకూడదు. సంపద కావాలి.. కానీ ప్రకృతిని నాశనం చేయకూడదు.

యువత చేతుల్లోనే రేపటి ప్రపంచం!

2026 నుంచి 2030 వరకు ప్రపంచంలో జరిగే మార్పులను ఎక్కువగా ఎదుర్కొనేది నేటి యువతే. వారి చేతుల్లోనే రేపటి ఉద్యోగాలు, పరిశోధనలు, రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థలు ఉంటాయి.విద్య అంటే కేవలం డిగ్రీలు సంపాదించడం కాదు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా కొత్త విషయాలు నేర్చుకోవడం, ప్రశ్నించడం, ఆలోచించడం, సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.తల్లిదండ్రులు పిల్లలకు కేవలం మార్కులు, ఉద్యోగాల గురించి మాత్రమే చెప్పకుండా మానవత్వం, క్రమశిక్షణ, ప్రకృతి ప్రేమ, సామాజిక బాధ్యతలను కూడా నేర్పించాలి.సాంకేతికంగా ప్రపంచాన్ని జయించినా.. మనిషిగా ఓడిపోతే ఆ విజయానికి అర్థం ఉండదు.

అయ్యప్ప దీక్షలోని సందేశమే ప్రపంచానికి అవసరం!

ఇక్కడ ఒక ఆధ్యాత్మిక సందేశాన్ని కూడా మనం గుర్తు చేసుకోవాలి.అయ్యప్ప దీక్షలో మాల ధరించిన స్వాములు ఒకరినొకరు కులం, మతం, ప్రాంతం, ఆర్థిక స్థితి ఆధారంగా చూడరు. అందరినీ 'స్వామి' అని సంబోధిస్తారు. నలభై ఒక్క రోజుల దీక్షలో క్రమశిక్షణ, సహనం, సాత్విక జీవనం, సేవాభావం, సమానత్వం నేర్చుకుంటారు.ఇది కేవలం ఒక ఆచారం కాదు. మనిషి తనలోని అహంకారాన్ని తగ్గించుకుని, ఎదుటివారిని గౌరవించడం నేర్చుకునే జీవన విధానం.ప్రపంచ దేశాలు కూడా ఇదే సూత్రాన్ని పాటిస్తే యుద్ధాల అవసరం తగ్గుతుంది. మతాలు, భాషలు, దేశాలు వేరైనా మనుషులంతా ఒకే మానవ కుటుంబానికి చెందినవారనే భావన పెరుగుతుంది.బుద్ధుడి కరుణ, గాంధీజీ అహింస, వివేకానందుడి మానవతా సందేశం, అయ్యప్ప దీక్షలోని సమానత్వ భావన.. ఇవన్నీ ప్రపంచానికి అవసరమైన జీవన విలువలే.

2030 నాటికి మనం ఎలా ఉండబోతున్నాం?

2030 నాటికి ప్రపంచం పూర్తిగా ఎలా మారుతుందో ఎవరూ కచ్చితంగా చెప్పలేరు. కానీ కొన్ని మార్పులు మాత్రం మన కళ్లముందే వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. యుద్ధాల కంటే శాంతి విలువను ప్రపంచం గుర్తించాల్సిన పరిస్థితి వస్తుంది. AIతో కలిసి పనిచేయడం ప్రతి రంగంలోనూ అవసరమవుతుంది. నీరు, ఆహారం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత పెరుగుతుంది. సాంకేతిక పరిజ్ఞానం తెలిసిన యువతకు కొత్త అవకాశాలు వస్తాయి. నిజమైన సమాచారం, విశ్వసనీయ జర్నలిజానికి మరింత విలువ పెరుగుతుంది. మానవ సంబంధాలు, మానసిక ప్రశాంతత, కుటుంబ విలువల అవసరం మరింత స్పష్టమవుతుంది. అయితే ఈ మార్పులన్నింటికంటే ముఖ్యమైనది ఒక్కటే. ప్రపంచం ఎంత ఆధునికంగా మారినా.. మనిషి మనిషిగా మిగలాలి! చంద్రుడిపైకి వెళ్లగలం. అంగారకుడిపై పరిశోధనలు చేయగలం. కృత్రిమ మేధస్సును సృష్టించగలం. సముద్రాల లోతులను కొలవగలం. కానీ పక్కింటి మనిషి ఆకలిని గుర్తించలేకపోతే, బాధలో ఉన్నవారికి చేయూత ఇవ్వలేకపోతే, మన అభివృద్ధికి అసలైన అర్థం ఏమిటి? యుద్ధాలు ఆగాలి. ఆకలి తీరాలి. ప్రకృతి బతకాలి. రైతు బాగుండాలి. యువతకు ఉపాధి రావాలి. జర్నలిజంలో నిజం నిలవాలి. మనిషిలో మానవత్వం పెరగాలి. రాబోయే ఐదేళ్లు ప్రపంచాన్ని మార్చవచ్చు. కానీ ప్రపంచాన్ని మంచిగా మార్చాల్సిన బాధ్యత మాత్రం మన చేతుల్లోనే ఉంది. మార్పు కోసం ప్రపంచాన్ని నిందించకండి.. మార్పును మనతోనే ప్రారంభిద్దాం. ఎందుకంటే భవిష్యత్తును నిర్ణయించేది యంత్రాల మేధస్సు మాత్రమే కాదు.. మనిషి హృదయంలో మిగిలి ఉన్న మానవత్వం కూడా!



వ్యాసకర్త:ఉక్కల్‌కార్ రాజేందర్ నాథ్,
సీనియర్ జర్నలిస్ట్, కామారెడ్డి జిల్లా
డీఎంఏసీ సభ్యులు, 9440387170

విద్యార్థుల బంగారు భవిష్యత్తు విద్య ద్వారానే సాధ్యం: సీఐ బన్సీ లాల్



(చెన్నూర్, సాక్షర): మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సీఐ బన్సీ లాల్ విద్యార్థులకు సూచించారు.చెన్నూరు పట్టణంలో మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలు, మహిళ చట్టాలు, మూఢ నమ్మకాలపై చెన్నూరు పోలీసుల ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.పట్టణంలోని స్థానిక పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు వాడటం వల్ల కలిగే అనర్థాలు, దుష్పరిణామాల గురించి వివరించారు. కార్యక్రమానికి వచ్చిన పాఠశాలల విద్యార్థులతో బ్లాక్ మ్యాజిక్ పై ఉన్న మూఢనమ్మకాలపై నిపుణులతో విద్యార్థులకు అర్థమయ్యేలా ప్రాక్టికల్ మ్యాజిక్ రూపకంగా చేసి చూపించి అవగాహన కల్పించారు. అలాగే మహిళా చట్టాలు, సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలు, వాహనాలు నడిపే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలు వంటి పలు అంశాలపై పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్యార్థి దశ నుండి డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించడం వల్ల వారికి మాదక ద్రవ్యాల వాడకం వల్ల ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించడం వల్ల మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలనకు ఎంతో సహాయపడుతుందని పోలీసులు తెలిపారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థిని విద్యార్థులకు కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తోడ్పడుతూ కృషి చేయాలని సూచించారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా వినియోగానికి సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్న వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. స్త్రీ విద్యతో దేశ అభివృద్ధి సాధ్యమని, డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, చెన్నూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, సైబర్ నేరాలు, మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ అవగాహన సదస్సులో సాంఘిక సమానత్వ సేవా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ హాజరై మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న నేటి తరుణంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు నమ్మడం దురదృష్టకరమని, ఇటీవల కాలంలో రాష్ట్రంలో మూఢనమ్మకాల పేరుతో హత్యలు జరగడం బాధాకరమని, దొంగ స్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఆర్థికంగా మోసం చేస్తున్నారని, డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, విద్యార్థి దశలోనే ఉన్నత చదువులతో తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తేవాలని, విద్యతో దేశ అభివృద్ధి సాధ్యమని తెలిపారు. సైన్స్ మ్యాజిక్ షోను ఉప్పులేటి నరేష్ నిర్వహించారు.ఈ అవగాహన సదస్సులో చెన్నూర్ పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్సై శ్యామ్ పటేల్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఐటీసీ గ్లోబల్ క్రిప్టో కరెన్సీ మోసం కేసులో నలుగురు నిందితులను అరెస్ట్



(ఆదిలాబాద్, సాక్షర): క్రిప్టో కరెన్సీ పేరుతో తక్కువ సమయంలో పెట్టుబడులు రెట్టింపు చేస్తామని, అధిక లాభాలు ఇస్తామని చెప్పే వ్యక్తులు, సంస్థల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె. నాగరాజు సూచించారు. ఐటీసీ గ్లోబల్ క్రిప్టో కరెన్సీ మోసం కేసులో అదే నిందితులపై మరో కేసు నమోదు అయింది. పెట్టుబడుల పేరుతో మరో ఇద్దరు బాధితుల నుంచి రూ.1,45,300 వసూలు చేసి, డబ్బులు తిరిగి చెల్లించకుండా మోసానికి పాల్పడిన నిందితులను ఆదిలాబాద్ టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె. నాగరాజు వెల్లడించారు.ఐటీసీ గ్లోబల్ క్రిప్టో కరెన్సీ పేరుతో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ప్రజల నుంచి పెట్టుబడుల రూపంలో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడిన నిందితులపై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైనట్లు టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె. నాగరాజు తెలిపారు. ఈ కేసులో సంబంధం ఉన్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. 2023 సంవత్సరంలో ఐటీసీ గ్లోబల్ సంస్థ ప్రతినిధులైన గాజుల ప్రమోద్ కుమార్, వేముల సుధీర్ తదితరులు ఫిర్యాదుదారుడైన మేకల రాకేష్‌ను సంప్రదించి, క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. వారి మాటలు నమ్మిన రాకేష్ రూ.95,300 పెట్టుబడిగా అందజేశారు. అదేవిధంగా రాకేష్ మిత్రుడైన దువ్వాక నరసింహులు కూడా రూ.50,000 వారికి చెల్లించారు.అయితే, పెట్టుబడిగా ఇచ్చిన డబ్బులను తిరిగి చెల్లించాలని పలుమార్లు కోరినప్పటికీ నిందితులు స్పందించకుండా కాలయాపన చేయడంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు బుధవారం ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో సంబంధం ఉన్న నలుగురు నిందితులు ఇదివరకే జైలులో ఉండగా వారిని పిటి వారెంట్ ద్వారా శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఇన్స్పెక్టర్ కె. నాగరాజు తెలిపారు. పొలమారశెట్టి రత్నరాజు @ రత్నం రాజు, 47, తండ్రి ప్రకాష్ రావు.దొండపాటి లక్ష్మణరావు ఆలియాస్ లాల్‌రాజ్, 46, తండ్రి సోమరాజు.గాజుల ప్రమోద్ కుమార్, 37, తండ్రి లింగమూర్తి.వేముల సుధీర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇలాంటి మోసాలకు గురైనవారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, సైబర్ ఆర్థిక మోసాలకు గురైతే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

డీఎంఈతో చర్చలు సఫలం

- సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలి



(హైదరాబాద్ /ఆదిలాబాద్, సాక్షర) మళ్లీ ఒక సమావేశం యూనియన్ నాయకులతో నిర్వహించి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డీఎంఈకి సూచించారు. శుక్రవారం మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ నాయకులు సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నాయకత్వంలో డీఎంఈని కలిసి జీతాల పెంపుదలపై చర్చలు నిర్వహించారు.ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవతో చర్చలు సాఫీగా సాగి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పేషెంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ ఉద్యోగుల వేతనాలు రూ. 20,243లకు పెంచటానికి ఒప్పుకున్నారు. పీఎఫ్ షేర్ క్రింద రూ. 1,800, ఈఎస్ఐ షేర్ క్రింద రూ. 152, అనగా మొత్తం రూ. 1,952 మినహాయించగా కార్మికుల చేతికి రూ. 18,291 చేతికి వచ్చేటట్లు డీఎంఈ ప్రతిపాదించారు.కానీ యూనియన్ నాయకులు మొత్తం వేతనం పైన ఈఎస్ఐ, పీఎఫ్ కట్ చేయాలని, కార్మికుని వాటాతో పాటు యాజమాన్యం వాటా కూడా కలిపి కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని, అలాగే సంవత్సరానికి 4 పండగ, 4 జాతీయ, 20 రోజుల హాజరుకు ఒక రోజు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని, అలాగే సంవత్సరానికి 2 జతల యూనిఫారంగా, ఒక నెల జీతం బోనస్ గా చెల్లించాలని గతంలో డిమాండ్ లెటర్ ఇచ్చామని, ఆ అంశాలపై స్పష్టత లేకుండా ఒప్పుకోవటం సాధ్యం కాదని యూనియన్ నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా, మళ్లీ ఒక సమావేశం యూనియన్ నాయకులతో నిర్వహించి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సీపీఐ శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు డీఎంఈకి సూచించారు. డీఎంఈ ఒక వారం రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని, అన్ని విషయాలు చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.కావున యూనియన్ తలపెట్టిన పోరాట కార్యక్రమాలను తాత్కాలికంగా వాయిదా వేసుకుంటున్నామని, న్యాయమైన కోర్కెలు పరిష్కారం కాని యెడల భవిష్యత్తు పోరాటాలను నిర్ణయించుకొని ముందుకు పోవాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. లక్ష్మీబాయి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహ్మా, రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి హసీనాబేగం, రాష్ట్ర కార్యదర్శి ఎ. పార్వతి, మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్. మూర్తి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, ఖమ్రుద్దీన్, కాంట్రాక్ట్ యూనియన్ నాయకురాలు షాహీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

వృషకర్మ' సినిమాతో మీ అందరి అంచనాలను అందుకుంటాం : నాగ చైతన్య

• యువ సామ్రాట్ నాగ చైతన్య, కార్తీక్ దండు, ఎస్వీసీసీ & సుకుమార్ రైటింగ్స్ 'వృషకర్మ' నుంచి మనసును హత్తుకునే మెలోడీ 'ఛలో పదవే' రిలీజ్



యువ సామ్రాట్ నాగ చైతన్య 'వృషకర్మ' సినిమాతో ప్రేక్షకులను మైథాలజీ, మిస్టరీతో కూడిన ఆసక్తికరమైన ప్రపంచంలోకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. డిసెంబర్ 4న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో రిలీజ్ కానుంది. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక థ్రిల్లర్ పురాతన రహస్యాలు, దాగి ఉన్న నిజాలు, ఉత్కంఠభరితమైన అంశాల చుట్టూ సాగుతుంది. ఎస్వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాను బాపినీడు సమర్పిస్తున్నారు. రిచ్ విజువల్స్, గ్రాండ్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో ప్రేక్షకులకు బిగ్ స్క్రీన్‌పై కొత్త అనుభూతిని అందించేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమా మ్యూజికల్ జర్నీని ఫస్ట్ సింగిల్ 'స్వాగ్ ఆఫ్ అర్జున్'తో గ్రాండ్‌గా ప్రారంభించారు. ఈ పాటలో హీరో స్టైల్, ఆటిట్యూడ్, ఎనర్జిటిక్ పర్సనాలిటీని చూపించడంతో ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు విడుదలైన రెండో పాట 'ఛలో పదవే' సినిమాలోని మరో ఎమోషనల్ కోణాన్ని పరిచయం చేస్తోంది. మొదటి పాటలోని ఎనర్జీకి భిన్నంగా, ఈసారి మనసును హత్తుకునే మెలోడీతో కథలోని సున్నితమైన భావోద్వేగాలను చూపించారు. అజనీష్ బి లోక్‌నాథ్ అందించిన సంగీతం పాటకు మంచి ఫీల్ తీసుకొచ్చింది. ఆకట్టుకునే మ్యూజికల్ అరేంజ్‌మెంట్‌తో భావోద్వేగాలను చక్కగా పలికించారు. అనంత శ్రీరామ్ రాసిన అర్థవంతమైన సాహిత్యం జీవితంలోని ప్రతి క్షణాన్ని ఆస్వాదించాల్సిన ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. సాయి విఘ్నేష్ తన వాయిస్‌తో పాటకు మరింత ఎమోషనల్ డెప్త్ తీసుకొచ్చారు. చిన్నారి గొంతుతో వచ్చే వోకల్స్ పాటలోని అమాయకత్వాన్ని, అందాన్ని మరింత పెంచాయి. నాగ చైతన్య, కియారా ఖన్నా మధ్య ఉండే ప్రత్యేకమైన అనుబంధాన్ని ఈ పాట చాలా అందంగా చూపిస్తుంది. చూపు లేని చిన్నారి అయినప్పటికీ, ఎంతో అమాయకంగా, తెలివిగా ఉంటుంది. ఆమె జీవితంలోని ప్రతి క్షణాన్ని ఆస్వాదించేలా అర్జున్ తన కళ్లుగా మారి అండగా నిలుస్తాడు. వీరిద్దరి మధ్య ఉండే ఆప్యాయత, అనుబంధం హీరోలోని మరో ఎమోషనల్ కోణాన్ని పరిచయం చేస్తుంది. ఈ పాటలో మీనాక్షి చౌదరి, జయరామ్, సత్య కూడా కనిపించారు. వీరంతా కలిసి ప్రయాణం చేసే క్రమంలో వచ్చే ఆహ్లాదకరమైన, మనసును తాకే సన్నివేశాలు పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి.ఈ సినిమాలో స్పర్ష్ శ్రీవాస్తవ విలన్ పాత్రలో నటిస్తున్నారు. టెక్నికల్‌గా ఈ సినిమాకు రాగుల్ డి హెరియన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైన్, నవీన్ నూలి ఎడిటింగ్. సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరో నాగ చైతన్య మాట్లాడుతూ.. మీ ఎనర్జీ చూస్తుంటే చాలా ఉత్సాహంగా ఉంది. 'ఛలో పదవే' పాట మీ అందరికీ నచ్చినందుకు చాలా హ్యాపీగా ఉంది. ఈ పాటకు అజ్నీస్ గారి మ్యూజిక్, అనంత శ్రీరామ్ గారి లిరిక్స్ చాలా బాగా కుదిరాయి. ఇవన్నీ కూడా ఈ సినిమాలో నాకు ఫేవరెట్. ఈ సినిమా డిసెంబర్ 4న రిలీజ్ అవుతుంది. ఇందులో నేను అర్జున్ అనే పాత్రలో నటించాను. తను ఒక ట్రెజర్ హంటర్. ఈ సినిమాలోని ప్రతి లేయర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా, ఫ్రెష్‌గా ఉంటుంది. డైరెక్టర్ కార్తీక్ ప్రతి క్యారెక్టర్‌ను ఒక కొత్తగా ప్రజెంట్ చేశారు. ఇది ఒక లార్జ్ స్కేల్ థియేట్రికల్ స్పెక్టికల్. తెలుగు ఆడియన్స్‌కు చాలా కొత్తగా ఉండబోతోంది. మీరు భారీ అంచనాలతో రండి. కచ్చితంగా మీ అంచనాలను అందుకుంటామని నమ్ముతున్నాం. డిసెంబర్ 4న థియేటర్లలో కలుద్దాం. నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ.. నేను అక్కినేని నాగేశ్వరరావు గారి అభిమానిని. ఇప్పుడు నాగచైతన్యతో సినిమా చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. నాగ్గరున గారితో కూడా సినిమా చేయాలని కోరుకుంటున్నాను. 'వృషకర్మ' అద్భుతంగా వచ్చింది. ఈ సినిమా కోసం చాలా గొప్ప ఆర్టిస్టులు, టెక్నీషియన్లు పనిచేశారు. ఇందులో నాగచైతన్య గారు ఎక్స్‌ట్రార్డినరీగా ఉన్నారు. ఈ సినిమా కచ్చితంగా చాలా పెద్ద హిట్ అవుతుందని భావిస్తున్నాము. నటీనటులు: నాగ చైతన్య, మీనాక్షి చౌదరి, స్పర్ష్ శ్రీవాస్తవ, జయరామ్, కియారా ఖన్నా, సత్య

గరుడవేగ' అంజి బాలీవుడ్ అరంగేట్రం



మహిళలపై జరుగుతున్న నేరాల వంటి సున్నితమైన అంశాన్ని ప్రధానాంశంగా తీసుకుని, మహిళా భద్రత, సమర్థవంతమైన పోలీసు దర్యాప్తు నేపథ్యంలో 'అన్‌ఎక్స్‌పెక్టెడ్ – సఫేద్ సచ్' చిత్రం ఉంటుంది. నిజ జీవిత ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న బహుభాషా క్రైమ్ థ్రిల్లర్ సినిమా 'యశ్ వీరా ఫిల్మ్స్' సమర్పిస్తుండగా, ప్యారేలాల్ గుండెచా (సోజాత్ రోడ్ వాలా) నిర్మిస్తున్నారు. టాలీవుడ్‌లో ప్రముఖ సినిమాటోగ్రాఫర్ 'గరుడవేగ' అంజి ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. ఈ మూవీలో పృథ్వీ రాజ్, తంబి రామయ్య, సంజయ్ సింగ్, గంజా కరుప్పు ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తారు. 'మర్డర్ 2', 'భాగ్ జానీ', 'ధర్మ సంకట్ మే' వంటి చిత్రాల్లో తనదైన నటనతో మెప్పించిన ప్రశాంత్ నారాయణన్ ఇందులో ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్-లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. తలపాగా, దట్టమైన గడ్డంతో సిక్కు పోలీస్ అధికారి అవతారంలో సంజయ్ కపూర్ కనిపిస్తుండగా, ప్రశాంత్ నారాయణన్ గంభీరమైన చూపులతో ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఎస్తేర్ అనిల్ సాంప్రదాయ ఎర్రటి తలపాగా ధరించి, పోస్టర్‌కు ఒక భావోద్వేగ కోణాన్ని జోడిస్తున్నారు. డెహ్రాడూన్ ఇంటర్-స్టేట్ బస్ టెర్మినల్ (ISBT)కి సంబంధించిన ఒక కేసును దర్యాప్తు చేసే ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్ ఎస్ఎస్పి భరత్ సింగ్ పాత్రలో సంజయ్ కపూర్ నటించారు. ఇంట్లో పెట్టిన ఒక ప్రేమలేఖ కారణంగా జరిగిన అపార్థంతో ఒక టీనేజ్ అమ్మాయి అదృశ్యం కావడమే ఈ సినిమా కథాంశం. ఆమె డెహ్రాడూన్ ISBT నుండి రాత్రి బస్సు ఎక్కి అదృశ్యమవ్వడంతో ఈ సంఘటన కలవరపరిచే మలుపు తీసుకుంటుంది. పాడుబడిన బస్సును కనుగొనడం, ఆ తర్వాత ఆమె అపస్మారక స్థితిలో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరడంతో పోలీసు దర్యాప్తు మొదలవుతుంది. సమాధానం దొరకని అనేక ప్రశ్నలే ఈ కథకు ప్రధానాంశంగా మారతాయి. ఒక దర్యాప్తులోని సంక్లిష్టతలను, ఒక సున్నితమైన కేసు వెనుక ఉన్న నిజాన్ని వెలికితీయడంలో చట్టాన్ని అమలుచేసే సంస్థలు ఎదుర్కొనే సవాళ్లను ఈ చిత్రం అన్వేషిస్తుంది. కేవలం ఒక క్రైమ్ థ్రిల్లర్‌ను ప్రదర్శించడమే కాకుండా, మహిళల భద్రతను నిర్ధారించడం, మానవ గౌరవాన్ని కాపాడటం పట్ల ఉన్న విస్తృత సామాజిక బాధ్యతను ఈ కథనం హైలైట్ చేయడానికి ప్రయత్నిస్తుంది. సంజయ్ కపూర్ మాట్లాడుతూ* .. ''అన్‌ఎక్స్‌పెక్టెడ్ – సఫేద్ సచ్'లో దర్యాప్తు చేసే పోలీస్ అధికారి పాత్ర పోషించడం గొప్ప అనుభవంగా భావిస్తున్నాను. మహిళల భద్రతకు సంబంధించిన సంఘటనలు కేవలం వార్తా శీర్షికలు మాత్రమే కావు, అవి సమాజంగా మనందరి సామూహిక బాధ్యతను గుర్తు చేస్తాయి. నా పాత్ర ద్వారా, సమగ్ర దర్యాప్తు, సత్యాన్వేషణ ప్రాముఖ్యతను తెలియజేయాలని ఆశిస్తున్నాము. ఇలాంటి సమస్యలను ప్రజల చర్చలోకి తీసుకురావడంలో సినిమా ఒక ముఖ్యమైన పాత్ర పోషించగలదని నేను నమ్ముతున్నాను' అని అన్నారు. ప్రశాంత్ నారాయణన్ మాట్లాడుతూ* ..''అన్‌ఎక్స్‌పెక్టెడ్ – సఫేద్ సచ్' సున్నితమైన, సామాజికంగా అంశాన్ని చర్చిస్తుంది. నిజ సంఘటనల నుండి ప్రేరణ పొందిన కథలు ఒక నిర్దిష్ట బాధ్యతను కలిగి ఉంటాయి. నటులుగా అటువంటి కథనాలను నిజాయితీగా, దృఢ విశ్వాసంతో సంప్రదించడం ఎంతో ముఖ్యం. ఈ సినిమాలోని ఆసక్తికరమైన కథాంశం, అది అందించాలనుకుంటున్న గొప్ప సందేశం నన్ను ఆకర్షించాయి. ప్రేక్షకులు ఈ సినిమాతో, అది లేవనెత్తే ప్రశ్నలతో మమేకమవుతారని నేను ఆశిస్తున్నాను' అని అన్నారు నిర్మాత ప్యారేలాల్ గుండేచా (సోజత్ రోడ్ వాలా) మాట్లాడుతూ* .. ''ఒక నిర్మాతగా, వినోదాన్ని అందించడంతో పాటు ముఖ్యమైన సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకురాగల శక్తి సినిమాకు ఉందని నేను నమ్ముతాను. 'అన్‌ఎక్స్‌పెక్టెడ్ – సఫేద్ సచ్' చిత్రంతో నిజ సంఘటనల నుండి ప్రేరణ పొందిన ఒక ఆసక్తికరమైన కథను అందించడంతో పాటు, మహిళల భద్రత, న్యాయం, బాధ్యతాయుతమైన పోలీసింగ్ ప్రాముఖ్యతను హైలైట్ చేయాలన్నది మా ఉద్దేశం. దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను ఆకట్టుకునే చిత్రాన్ని రూపొందించడానికి మేము ప్రతిభావంతులైన నటీనటులను, సాంకేతిక బృందాన్ని ఒకచోట చేర్చాము. ఈ చిత్రం ఒక శక్తివంతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తూనే, అర్థవంతమైన సంభాషణలను ప్రోత్సహిస్తుందని నేను ఆశిస్తున్నాను' అని అన్నారు. దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ 'గరుడవేగ' అంజి మాట్లాడుతూ* .. ''అన్‌ఎక్స్‌పెక్టెడ్ – సఫేద్ సచ్' సంప్రదాయ క్రైమ్-థ్రిల్లర్ కథనానికి అతీతంగా ఉంటుంది. నిజ సంఘటనల నుండి ప్రేరణ పొందిన ఈ చిత్రం, మహిళల భద్రత, ప్రజా బాధ్యత , జీవితాలను మార్చగల పరిస్థితుల పరిణామాలను అర్థం చేసుకోవడం ప్రాముఖ్యతపై సంభాషణలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. విస్తృత దృష్టికి అర్హమైన ఒక అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆకట్టుకునే సినిమాటిక్ అనుభూతిని అందించాలన్నది మా ఉద్దేశం' అని అన్నారు. ఈ చిత్రానికి కెవిన్ రాయ్ సంగీతం అందించారు. పాన్-ఇండియా స్థాయిలో ఆదరణ పొందేలా, 'అన్‌ఎక్స్‌పెక్టెడ్ – సఫేద్ సచ్' హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, గర్వాలీ, గుజరాతీ, పంజాబీ, భోజ్‌పురి వంటి తొమ్మిది భాషల్లో రూపొందుతోంది. సంజయ్ కపూర్, ప్రశాంత్ నారాయణన్, ఎస్తేర్ అనిల్ కలిసి నటిస్తున్న ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్, ఆసక్తికరమైన క్రైమ్ కథనాన్ని సామాజిక ప్రాముఖ్యత ఉన్న అంశంతో మేళవించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ చిత్రం 2027లో థియేటర్లలో విడుదల కానుంది.

పెళ్లి పీటలెక్కబోతున్న యంగ్ హీరో శివ కందుకూరి



తెలుగు సినిమాల్లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో శివ కందుకూరి త్వరలోనే తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నారు. ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి తనయుడైన శివ కందుకూరి, ఈ డిసెంబర్‌లో శిశిర సింహాను వివాహం చేసుకోబోతున్నారు. 'చూసీ చూడంగానే', 'గమనం', 'మను చరిత్ర', 'భూతద్దం భాస్కర్ నారాయణ' వంటి సినిమాల్లో తన నటనతో శివ కందుకూరి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో కొన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఆర్కిటెక్ట్ శిశిర సింహా త్వరలోనే కందుకూరి కుటుంబంలోకి అడుగుపెట్టబోతున్నారు. ఈ పెళ్లి వేడుక రెండు కుటుంబాలకు ఎంతో ప్రత్యేకమైన సందర్భంగా నిలవనుంది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ఆత్మీయుల సమక్షంలో ఈ వేడుక జరగనుంది. శివ కందుకూరి తండ్రి రాజ్ కందుకూరి తెలుగు సినిమా ఇండస్ట్రీలో నిర్మాతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు తన కుమారుడి పెళ్లి ఆయనతో పాటు కుటుంబ సభ్యులకు ఎంతో ఆనందాన్ని, భావోద్వేగాన్ని కలిగించే సందర్భం కానుంది. టాలీవుడ్‌లో మరో పెళ్లి సందడి మొదలుకాబోతున్న నేపథ్యంలో, కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్న శివ కందుకూరి, శిశిర సింహా జంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

సుమ లాంచ్ చేసిన అమీర్‌పేటలో "వరం"తొలి ఫ్లాగ్‌షిప్ స్టోర్

• ఫైన్ ఫ్యాషన్ జ్యువెలరీలో ఆధునిక లగ్జరీ అనుభూతిని అందించనున్న VARAM



హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో VARAM తన తొలి ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను నవంబర్ 20, 2026న ఘనంగా ప్రారంభించింది. ప్రముఖ యాంకర్, నటి, నిర్మాత సుమ గారు ఉదయం 10 గంటలకు ఈ స్టోర్‌ను ప్రారంభించారు. ఆధునిక హంగులతో రూపొందించిన ఈ 1,500 చదరపు అడుగుల స్టోర్‌లో వివిధ రకాల ఫ్యాషన్ జ్యువెలరీ అందుబాటులో ఉన్నాయి. ఇయర్‌రింగ్స్, నెక్లెస్‌లు, రింగ్స్, బ్రేస్‌లెట్స్, హారాలు, వడ్డాణాలు, ప్రత్యేకంగా రూపొందించిన జ్యువెలరీ సెట్స్ వంటి విస్తృత శ్రేణి ఆభరణాలను ఇక్కడ కస్టమర్లు వీక్షించడంతో పాటు ధరించి తమకు నచ్చిన స్టైల్స్‌ను ఎంచుకోవచ్చు. ఈ సందర్భంగా VARAM వ్యవస్థాపకురాలు, CEO ప్రియాంక వేములూరి మాట్లాడుతూ.. "మా VARAM తొలి స్టోర్‌ను ప్రారంభించడం ఎంతో ప్రత్యేకమైన సందర్భం. మా డిజైన్ ఆలోచనలను, ఆభరణాల నాణ్యతను, ప్రత్యేకతను, వైవిధ్యాన్ని కస్టమర్లు నేరుగా అనుభూతి చెందేలా ఈ స్టోర్‌ను ఏర్పాటు చేశాం. సంప్రదాయ జ్యువెలరీ షోరూమ్‌లా కాకుండా, ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత అభిరుచికి అనుగుణంగా ఆభరణాలను ఎంచుకుని తమ స్టైల్‌ను వ్యక్తపరిచే ప్రత్యేకమైన ప్రదేశంగా ఈ స్టోర్ ఉండాలని కోరుకున్నాం" అని తెలిపారు.ప్రారంభోత్సవ ప్రత్యేక ఆఫర్ VARAM స్టోర్‌లో ప్రతి రూ.5,000 విలువైన కొనుగోలుపై ఒక ఉచిత బంగారు నాణెం అందిస్తున్నారు.

Printed, Published, Edited and Owned by A. Linganna, Printed at EVR Printers, Vidyanagar, Adilabad - 504001. Telangana.
Published at D.No. 5-91/2, Talamadugu (Vill & Mandal) Adilabad - 504312. A.P. RNI No. APTEL/2011/42149. Editor A. Linganna.
Phone: 08732-231345. Email: Saaksharaadb@gmail.com